

తీరంలో దీపాలను వదులుతున్న యువతులు



పామూరు శివాలయంలో భక్తుల పూజలు



ఒంగోలు కేశవస్వామిపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి జ్వాలాతోరణంలో పాల్గొన్న భక్తులు

హరోంహర..

జిల్లావ్యాప్తంగా బుధవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శివ నామస్మరణ మార్మోగింది. కార్తీక పౌర్ణమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునుంచే శివాలయాల వద్ద బారులు తీరారు. పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివచ్చిన భక్తులతో కొత్తపట్నం పల్లెపాలెంతోపాటు ఇతర తీరప్రాంతాల్లో కోలాహలం నెలకొంది. ప్రముఖ శైవక్షేత్రాలైన భైరవకోన, త్రిపురాంతకం, జమ్ములపాలెంలోని 1,116 శివలింగాల వేదిక, రామతీర్థంలకు భక్తులు పోటెత్తారు. రాత్రికి ఆయా ఆలయాల్లో జ్వాలా తోరణాన్ని వైభవంగా నిర్వహించారు.

లోపలి పేజీల్లో..



కార్తీకదీపాలతో కళాత్మకంగా కొత్తపట్నం తీరం



ప్రత్యేక అలంకరణలో త్రిపురాంతకేశ్వరస్వామి



పెద్దదోర్నాల మండలం తిమ్మాపురంలో మిరప పొలం నుంచి వరద ప్రవాహాన్ని చూపుతున్న రైతు కాశయ్య

ఉపశమన చర్యలు వేగవంతం

తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రోడ్లు, నీటి వనరులకు తాత్కాలిక మరమ్మతులు

- పంట నష్టాలపై సర్వే పూర్తి
- 16,506 మంది రైతులకు చెందిన 12,196.30 హెక్టార్లలో నష్టం
- ఇప్పటికే ముంపునకు గురైన కుటుంబాలకు ఆర్థికసాయం, నిత్యావసరాలు అందజేత
- శాశ్వత మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు, స్థానిక నేతల సహకారం
- అక్కడక్కడా ఇంకా నీటిలోనే పంటలు
- చాలాచోట్ల రాకపోకలకు ఇక్కట్లు

మొంథా తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. అల్లకల్లోలం సృష్టించింది. పెద్దఎత్తున పంటలు, ఇతర ఆస్తులకు నష్టం చేకూర్చింది. తుఫాన్ వెళ్లి వారం గడుస్తున్నప్పటికీ ఇంకా చాలా ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు నిలిచి ఉంది. అనేకచోట్ల దెబ్బతిన్న రోడ్లు, నీటి వనరులతో ప్రజానీకం అవస్థ పడుతోంది. ఈనేపథ్యంలో ఉపశమన చర్యలను ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం వేగవంతం చేసింది. ఇప్పటికే ముంపునకు గురైన కుటుంబాలకు నగదు, నిత్యావసర సరుకులను అందించారు. పంట నష్టాలపై రైతు వారీ సర్వేను కూడా పూర్తి చేశారు. దారుణంగా దెబ్బతిన్న రోడ్లు, నీటి వనరులకు తాత్కాలిక మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు.



మార్కాపురం నుంచి కొండేపల్లి వెళ్లే రహదారికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఒంగోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపై మొంథా తుఫాన్ విరుచుకుపడింది. అనేక వర్గాల వారిని కోలుకోలేని దెబ్బతీసింది. కేవలం 36 గంటల్లో 18.40 సెం.మీ సగటు వర్షపాతం నమోదైంది. చాలా మండలాల్లో 20నుంచి 26 సెం.మీ కురిసింది. అలా కొద్ది వ్యవధిలో అతిభారీ వర్షం ముంచెత్తడంతో జనజీవనం అతలాకుతలమైంది. పంటలు, ఇతర వనరులకు అపార నష్టం వాటిల్లింది. అధికార యంత్రాంగం అంచనా ప్రకారం జిల్లాలో రోడ్లకు అధిక నష్టం జరిగింది. అనేక చోట్ల ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయాయి. పలు ప్రాంతాల్లో భారీ కోతకు గురై రాకపోకలకు వీలులేని విధంగా పరిస్థితి తయారైంది. ఒక్క ఆర్అండ్‌బీ రోడ్లకే రూ.180.66 కోట్ల మేర నష్టం వాటిల్లింది. పంచాయతీరాజ్ పరిధిలో రూ.70.41 కోట్లు, మునిసిపాలిటీల్లో రూ.10.91 కోట్లు, విద్యుత్ శాఖకు రూ 3.33కోట్లు నష్టం చేకూరినట్లు అంచనా.

రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు దారుణంగా దెబ్బతిని రాకపోకలకు వీలులేని స్థితికి చేరాయి. వీటికి తక్షణం అవసరమైన తాత్కాలిక మరమ్మతులపై అధికారులు దృష్టి సారించారు. ఆ పనులను రెండు రోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు ముమ్మరం చేశారు. కొన్నిచోట్ల నీటి వనరులకు సంబంధించిన చర్యలను ఆశాఖ అధికారులు తీసుకుంటున్నారు. అక్కడక్కడా స్థానిక అధికార పార్టీ నాయకులు చొరవచూపి సొంత ఖర్చులతో తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నారు.

పంట నష్టంపై యుద్ధప్రాతిపదికన సర్వే

ప్రాథమికంగా పంట నష్టాలను గుర్తించిన వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వ ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన రైతువారీ పంట నష్టంపై సర్వే చేపట్టారు. మంగళవారం సాయంత్రానికి ఒక కొలిక్కి తెచ్చారు. మొంథా తుఫాన్ వల్ల 16,506 మంది రైతులకు చెందిన 12,196.30 హెక్టార్లలో 14 రకాల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. అందులో అత్యధికంగా 8,087.50 హెక్టార్లలో పత్తి ఉంది. 1,465.30 హెక్టార్లలో వరి, 1,346.53హెక్టార్లలో సజ్జ, 1,158.24 హెక్టార్లలో

మిగతా 6లో...

ముంపు బాధితులకు తక్షణ సాయం

జిల్లాలో ముంపునకు గురైన వారికి తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో చొప్పున నూనె, కందిపప్పు, బంగాళాదుంప, ఉల్లిపాయల వంటివి ఇప్పటికే అధికారులు పంపిణీ చేశారు. నిరాశ్రయులుగా పునరావాస కేంద్రాలకు వచ్చిన వారందరికీ నగదు అందించారు. ఒక కుటుంబంలో ఒకరు పునరావాస కేంద్రానికి వస్తే రూ.వెయ్యి, ఇద్దరు వస్తే రూ.2వేలు, అంతకన్నా ఎక్కువ మంది సభ్యులు ఉంటే రూ.3వేల వంతున ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆప్రకారం మూడువేలకు పైగా కుటుంబాలకు నగదును అందజేశారు.

మార్కాపురం జిల్లాకు గ్రీన్‌సిగ్నల్!

- పరిశీలనలోకి గిద్దలూరు రెవెన్యూ డివిజన్
- దర్శిలోని కొన్ని మండలాలపై తర్జనభర్జన
- 10వ తేదీ లోపు సీఎం చంద్రబాబుకు మంత్రివర్గ ఉపసంఘం నివేదిక



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు మంత్రివర్గ ఉపసంఘం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రితో సమావేశమైన ఉపసంఘం సభ్యులు బుధవారం మరోసారి సచివాలయంలో సమావేశమయ్యారు. సీఎంకు ఇవ్వాల్సిన తుది నివేదికపై ఇంకోసారి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా ఏర్పాటును ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే ప్రకాశం జిల్లాలోకి కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను కలపాలన్న విషయంపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈనెల 10వతేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈలోపు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తమ నివేదికను సమర్పించాలన్న ఉద్దేశంతో ఉపసంఘం సభ్యులు ఆయా అంశాలపై ఎక్కువ సేపు సమీక్ష చేశారు. గిద్దలూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్న అంశాన్ని కూడా ఉపసంఘం సభ్యులు

మిగతా 6లో...

రేపు మంత్రి నిమ్మల వెలిగొండకు రాక

- ప్రాజెక్టు పనుల పరిశీలన.. అధికారులతో సమీక్ష

త్రిపురాంతకం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం వెలిగొండ ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఈమేరకు ఆయన పర్యటన ఖరారైంది. షెడ్యూల్ ప్రకారం మంత్రి నిమ్మల గురువారం సాయంత్రం విజయవాడ నుంచి బయల్దేరి రాత్రికి దోర్నాల చేరుకుని వెలిగొండ అతిథిగృహంలో బస చేస్తారు. 7వతేదీ ఉదయం 7గంటలకు కొత్తూరు వద్ద తీగలేరు వాగును, అనంతరం టన్నెళ్లను పరిశీలిస్తారు. తరువాత ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

ఐదు శాఖలు.. 12 అంశాలు!

- రేపు డీఆర్సీ సమావేశం
- అజెండాను సిద్ధంచేసిన అధికారులు

ఒంగోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం ఈనెల 7న జరగనుంది. ఐదు కీలక రంగాలకు సంబంధించిన 12 అంశాలతో అధికారులు అజెండాను సిద్ధం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన శుక్రవారం ప్రకాశం భవనంలోని పీజీఆర్ఎస్ సమావేశపు హాలులో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. ముఖ్య ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. అజెండాలో తొలి అంశంగా తాగునీటిని చేర్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరాపై చర్చించనున్నారు. రెండో అంశంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, మూడో అంశంగా వ్యవసాయ, అనుబంధ శాఖలు ఉన్నాయి. నాల్గో అంశంగా భూసేకరణను చేర్చారు. అందులో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశం

మిగతా 6లో...

తురకపాలెం కార్యదర్శి సస్పెన్షన్

- మరో నలుగురికి షోకాజ్ నోటీసులు
- పన్ను అసెస్‌మెంట్‌లో నిర్లక్ష్యమే కారణం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను అసెస్‌మెంట్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ రాజాబాబు బుధవారం సస్పెండ్ చేశారు. మరో నలుగురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామాల్లో స్వర్ణ పంచాయతీ ఇంటి పన్ను అసెస్‌మెంట్ ద్వారా ప్రతి గృహ యజమాని ఫోన్ నంబరును పొందుపర్చాల్సి ఉంది. అయితే తాళ్లూరు మండలం తురకపాలెంలో 603 గృహాలు ఉండగా ఆ పంచాయతీ కార్యదర్శి ఎ.వెంకటేశ్వర్లు అసెస్‌మెంట్‌లో 583 గృహాలకు ఒకే ఫోన్ నంబర్‌ను నమోదు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన పంచాయతీ రాజ్ కమిషనర్ సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావును ఆదేశించారు. ఆయన సిఫార్సు మేరకు వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

బాధ్యతలు తీసుకున్న రెండు రోజులకే..

తురకపాలెం పంచాయతీ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు ఈనెల 3వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. అక్కడ అప్పటి వరకూ పనిచేసిన కార్యదర్శి ఈనెల 2న రికార్డులు అప్పగించినట్లు తెలిసింది. దీంతో హడావుడిగా ఆయన ఒక ఫోన్ నంబర్‌ను నమోదు చేసినట్లు సమాచారం. అసెస్‌మెంట్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాగులుప్పలపాడు మండలం

మిగతా 6లో...

ఏసీబీ మెరుపు దాడి

- ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు
- రూ.48 వేల నగదు సీజ్
- జిల్లావ్యాప్తంగా కలకలం

ఒంగోలు క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపుదాడి చేశారు. స్థానిక పాతగుంటూరు రోడ్డులోని కార్యాలయంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయ మొదటి అంతస్థులో జాయింట్-1, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌లు కార్యకలాపాలు సాగిస్తుంటారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌లు బి.రమేష్‌బాబు, సిహెచ్.శేషులు సిబ్బందితో నేరుగా అక్కడికి చేరుకున్నారు. తనిఖీలు ప్రారంభించారు. దీంతో కొంతమంది మొదటి అంతస్థు నుంచి కిందకు నగదు విసిరేసారు. ఆ మొత్తం

మిగతా 6లో...



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు (ఇన్‌సెట్‌లో) కార్యాలయం పైనుంచి విసిరిన నగదు

10 నుంచి సమ్మెటివ్-1 పరీక్షలు 6

అవసరం ఇక్కడ.. ఆఫీసు అక్కడ!
ఉమ్మడి రాష్ట్రం నుంచి శ్రీశైలంలోనే ఐటీడీఏ ప్రాజెక్ట్
ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోనే అధికంగా చెంచులు
కొత్త జిల్లాల నేపథ్యంలో దోర్నాలలో ఏర్పాటుకు వినతి
మంత్రుల కమిటీ ముందుకు ప్రతిపాదన 7

మార్కాపురం జీజీహెచ్ నుంచి వైద్య సామగ్రి తరలింపు
పీపీపీలోకి వెళ్లడంతో నిర్ణయం 6

పోలీసుల అదుపులో కేటుగాడు

ఒంగోలు క్రైం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పిస్తానంటూ ఒంటరి గా నివాసం ఉండే వృద్ధురాళ్లను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడే కేటుగాడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఒంగోలు నగరంలోని కమ్మపాలెం, ఇందిరకాలనీలో ఇరువురు వృద్ధురాళ్లను మోసం చేసి వారి వద్ద నుంచి రూ.50 వేల నగదు అపహరిచాడు. ఆర్నేళ్ల క్రితం ప్రభుత్వం కుట్టుమిషన్లు ఇస్తుందంటూ మాయమాటలు చెప్పి ప్లేటులో చీర, నగదు పెట్టి ఫొటో తీయాలంటూ వృద్ధురాళ్ల దృష్టి మరల్చి నగదు అపహరించుకెళ్లాడు. చీరాలలో ఇదే తరహా కేసు నమోదైంది. దీంతో బాపట్ల, ప్రకాశం జిల్లాల పోలీసులు నిఘా ఉంచారు. ప్రకాశం జిల్లా సీసీఎస్ పోలీసులు కేటుగాడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బాపట్ల, ప్రకాశం, గుంటూరు జిల్లాలో సుమారుగా 30 మందిని ఈ కేటుగాడు మోసాలు చేసి నగదు దోచుకెళ్లాడు.

10నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

ఒంగోలు విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 10నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. 6,7 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 నుంచి 4.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 1నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 11నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి.

రైతులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం తక్షణమే ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక మాదాల నారాయణస్వామిభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల జిల్లాలో భారీ నష్టం జరిగిందన్నారు. రాష్ట్రంలో 16లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. రైతులకు ఎకరాకు రూ.25నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. కార్యక్రమంలో బి.పద్మ, రాజశేఖర్, జాలన్న, తిరుమలరావు, వి.రామ్మోహన్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో స్టెతస్కోప్‌ల అందజేత

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి స్టెతస్కోప్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అందజేశారు. టెక్సాస్‌లో పనిచేస్తున్న అత్తిపట్ల అశోక్ కుమార్‌చౌదరి సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న 12మంది మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం వీటిని అందజేశారు. ఈ స్టెతస్కోప్‌లను విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్యసేవలకు ఉపయోగించుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుందర్, డాక్టర్ ఎం.సువర్ణరాజు, జిల్లా ఆరోగ్య విస్తరణ, మీడియా అధికారి బెల్లం నరసింహారావు, 104 సర్వీసెస్ జిల్లా మేనేజర్ జిలానీ పాల్గొన్నారు.

మార్కాపురం జీజీహెచ్ నుంచి వైద్య సామగ్రి తరలింపు

పీపీపీ మోడ్‌లోకి వెళ్లడంతో డీఎంఈ ఆదేశం

మెరుగైన వైద్య సేవలు కష్టమే



మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల

మార్కాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్) నుంచి వైద్య సామగ్రిని తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎమ్ఈ) డాక్టర్ జి.రఘునందన్ గత నెలలోనే ఆదేశాలు జారీ చేశారు. ఏ పరికరాలు ఏ వైద్య కళాశాలకు తరలించాలో ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కాపురానికి వైద్య కళాశాల మంజూరు కావడంతో జిల్లా వైద్యశాలను అప్‌గ్రేడ్ చేసి జీజీహెచ్‌గా మార్పు చేశారు. అప్పట్లో వైద్య కళాశాల స్థాయికి అనుగుణంగా వైద్యులను, సామగ్రిని ఏర్పాటు చేశారు. 150 బెడ్లతో ఉన్న వైద్యశాలను 350 బెడ్లకు పెంచారు. కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగాయి. అంతేకాక నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి తరగతులు నిర్వహించేందుకు సకాలంలో అనుమతులు తేలేకపోయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు మెడికల్ కాలేజీల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని ఎలాగైనా పూర్తి చేయాలని పీపీపీ విధానంలోకి మార్చారు. ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారు. త్వరలో టెండర్ దక్కించుకున్న సంస్థ వైద్య కళాశాలను నిర్మించనుంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఆ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఆగకుండా మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు ఉన్నపళంగా వైద్య సామగ్రి తరలించడంతో సేవలు మృగ్యమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

పలు వైద్య కళాశాలలకు తరలింపు

మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉన్న మార్కాపురం సర్వజన వైద్యశాలకు గతంలో 22 రకాలైన అధునాతన వైద్య పరికాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పరిధి నుంచి మెడికల్ కాలేజీ పీపీపీ మోడ్‌లోకి వెళ్లనుండడంతో ఇక్కడ ఉన్న వైద్య సామగ్రిని రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలలకు తరలించేందుకు నిర్ణయించారు. అందులో భాగంగా 5 రకాలైన వైద్య సామగ్రిని గుంటూరు మెడికల్ కాలేజీకి మూడు రోజుల కిందట తరలించారు. అవేకాక ఇంకా 17 రకాల సామగ్రిని విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, నంద్యాల, కడప, విశాఖపట్నం, అనంతపురం, ఒంగోలు, నెల్లూరుతోపాటు మరికొన్ని వైద్య కళాశాలలకు తరలించనున్నారు. ఆయా వైద్య కళాశాలల్లో లేని సామగ్రిని ఇక్కడ నుంచి తరలించనున్నారు. మార్కాపురంతోపాటు పీపీపీ మోడ్‌లోకి తీసుకున్న ఆదోని, పులివెందుల, మదనపల్లె ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లోని సామగ్రిని కూడా ఇదే విధంగా తరలించేందుకు ఆదేశాలిచ్చారు.

సౌకర్యాలు లేకుంటే వైద్యం కష్టమే

మార్కాపురం జీజీహెచ్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నప్పుడే ఇక్కడ నుంచి కేసులను ఇతర ప్రాంతాలకు తరలించే వాళ్లు. అప్పట్లో కూడా కేవలం చిన్నపాటి వైద్యం మాత్రమే అందించే వాళ్లు. సౌకర్యాల కల్పన వలన కొన్ని శస్త్ర చికిత్సలు చేసేందుకు వీలు ఏర్పడింది. మెడికల్ కాలేజీకి కేటాయించిన వైద్యులను ఇప్పటికే పలు ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో ఉన్న కొద్దిపాటి వైద్యులతోనే నెట్టుకొస్తున్నారు. అధునాతన వైద్య సామగ్రి తరలిపోతే రోగులకు మెరుగైన వైద్య సేవలు లభించడం కష్టమే. పీపీపీ విధానం ద్వారా టెండర్ దక్కించుకున్న సంస్థ త్వరితగతిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తేనే ప్రజలకు వైద్యసేవలందించే వీలు కలుగుతుంది. అప్పటి వరకైనా మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు వైద్య సామగ్రిని ఉంచితే సరిపోయేదని డివిజన్ ప్రజలు వాపోతున్నారు.


జీజీహెచ్‌లో వైద్యం కోసం బారులు తీరిన రోగులు

వైద్య సామగ్రి తరలించాలని ఆదేశాలు అందాయి

రామచంద్రరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్, మార్కాపురం

ప్రస్తుతం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న 22 రకాల సామగ్రిని పలు మెడికల్ కాలేజీలకు తరలించాలని డీఎంఈ ఆదేశాలిచ్చారు. గుంటూరు మెడికల్ కాలేజీ వాళ్లు కొన్ని పరికరాలను తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు కేటాయించిన మేరకు మిగిలిన సామగ్రిని కూడా త్వరలోనే ఇతర కాలేజీల వాళ్లు తీసుకెళ్లనున్నారు. అధునాతన సామగ్రి లేకుంటే మెరుగైన వైద్యం అందించాలంటే కొంత మేర ఇబ్బందులే.

పృథులగిరి ఘాట్ రోడ్డును త్వరితగతిన నిర్మిస్తాం

- **మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య**


ధ్వజస్థంభానికి మొక్కుతున్న సత్య

మర్రిపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన పృథులగిరి ఘాట్ రోడ్డు నిర్మాణం పనులను వీలైనంత త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య చెప్పారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆయన లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ.. పృథులగిరి అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితోపాటు తాను కూడా కృషి చేస్తున్నానన్నారు. మంత్రి స్వామి చొరవతో నాలుగు ఘాట్ రోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్ల డీఎంఎఫ్ నిధులు మంజూరైయ్యాయని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో టెండర్ నోటిఫికేషన్ విడుదలయ్యిందని చెప్పారు. కార్తీక మాసం ముగిసేలోపు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. నిధులు అవసరమైతే ఈ పనులు పూరి అయ్యేలోపు అదనపు నిధులు తీసుకొచ్చేందుకు శాయశక్తుల కృషి చేస్తామని చెప్పారు. పృథులగిరిని ఆధ్యాత్మిక క్షేత్రంతోపాటు, పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకముందు కొండపైకి చేరుకున్న సత్యకు ఆలయ కార్యనిర్వాహణ అధికారి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు ఎర్రమోతు శ్రీనివాసులు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు వేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహరావు, మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, చేరెడ్డి నరసారెడ్డి, మాకినేని శ్రీనివాసరావు, గొంటు హనుమారెడ్డి, బాలగిరి వెంకటేశ్వర్లు, కిలారి శ్రీనివాసరావు ఉన్నారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

- **పటిష్ట బందోబస్తు నిర్వహించిన పోలీసులు**


పూజలు అందుకుంటున్న మోక్ష రామలింగేశ్వరస్వామి


కోనేరులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న రామతీర్థం మోక్షరామలింగేశ్వరాలయానికి కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా నలువైపులనుంచి భక్తులు పోటెత్తారు. పురాణ ప్రాశస్త్యం గల ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో భక్తులు పుణ్య స్నానమాచరించి మూలవిరాట్ రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ప్రత్యేకంగా నిర్వహించిన అభిషేకాలు, విశేష పూజల్లో ప్రముఖ పార్టీల నాయకులు, గ్రానైట్ వ్యాపారులు, వీఐపీలు స్వామి వారిని దర్శించుకున్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సీఐ దాసరి ప్రసాద్, ఎస్ఐ కృష్ణయ్య, తన సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాడరేవు సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో విశేష పూజలు జరిగాయి. వివిధ కుల సంఘాల సత్రాలలో అన్నదానాన్ని నిర్వహించారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి వేడుకలును చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రం, సాక్షి రామలింగేశ్వరాలయం, వీరభద్రేశ్వరాలయం, గోనుగుంట, పల్లామల్లి, నేకునంబాదు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే జ్వాలాతోరణంను కనులపండవగా నిర్వహించారు.

కళారంగ రారాజు బండారు రామారావు

ఒంగోలు కల్చరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కళారంగంలో తిరుగులేని నటునిగా రాణించి వేలాదిమంది అభిమానులను పొందటమే కాకుండా వందలాది మంది నటులకు మార్గదర్శకులుగా నిలిచిన కళారంగ రారాజు బండారు రామారావు అని పలువురు పేర్కొన్నారు. పౌరాణిక నటులు బండారు రామారావు 49వ వర్ధంతిని బుధవారం శ్రీరామ నాట్యమండలి అధ్యక్షులు శ్రీపతి ప్రకాశం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నెల్లూరు బస్టాండు డీఆర్ఆర్ మునిసిపల్ హైస్కూల్ దగ్గర ఉన్న రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ వేమా శ్రీనివాస రావు నేతృత్వంలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో యాదల రాజశేఖర్, ఎద్దు శశికాంత్ భూషన్, బండారు ఆనంద రావు, శ్రీపతి సతీష్, కండే శ్రీనివాసరావు, ఉలిచి బాబూరావు, మిడసల మల్లిఖార్జున రావు, కనమాల రామవులు, కట్టా సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం ప్రదర్శించిన చింతామణి, సత్య హరిశ్చంద్ర నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.


మాట్లాడుతున్న శ్రీపతి ప్రకాశం

మద్దిపాడులో..

మద్దిపాడు: బండారు రామారావు సేవలు యువత కొనసాగించాలని కళాకారుడు కాకుమాను సుబ్బారావు కోరారు. మద్దిపాడు నటరాజ కళాకేంద్రంలో బండారు రామారావు వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమంలో గంగిశెట్టి నరసింహారావు, దేవరశెట్టి ఎల్లమంద, గంట కోటేశ్వరరావు, కటకం వెంకటేశ్వర్లు, నేలటూరి సత్యనారాయణ, ఆరి సూర్యనారాయణ, సుమన్, రమేష్ పాల్గొన్నారు.

'ఉత్తమ' ఉద్యోగులకు సత్కారం


ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ బుధవారం మద్దిపాడులో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతను గుర్తెరిగి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు ఉత్తమ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మందపల్లి శ్రీనివాసరావు, గోరంట్ల చిరంజీవి, పోతినేని శ్రీనివాసరావు, మార్నేని రాఘవరావు, దుగ్గినేని నరసింహారావు, దేవబత్తిన ప్రసాద్, రావిపాటి శ్రీనివాసరావు, చెన్నుపల్లి వెంకటరమణ, గట్టినేని అయ్యన్న పాల్గొన్నారు.

బండ్లమూడిలో బాధితుడి పొలం పరిశీలన


పొలంలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కంట్లం ఏసుదాసుకు చెందిన పొలాలను బుధవారం ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ బ్రహ్మయ్యతో కలిసి సందర్శించారు. గొర్రెలు పొలంలోకి రావటం ద్వారా ఎంతమేర పంటనష్టం జరిగిందో పరిశీలించారు. సంబంధిత అధికారుల ద్వారా అంచనా వేశారు. తదుపరి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

అవీఇవీ

రోడ్లు, కాలువల పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయండి


కలెక్టర్ రాజాబాబును సత్కరిస్తున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో రోడ్లు, కాలువలు ధ్వంసమయ్యాయని, వాటిని పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం గొట్టిపాటి లక్ష్మితో పాటు టీడీపీ యువనాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్‌లు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ను శాలువతో సత్కరించి మొక్కను అందజేశారు. ఆమె నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తుఫాన్ బీభత్సంతో నియోజకవర్గంలో జరిగిన ఆస్తి, పంట నష్టాలపై కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎన్ఎస్‌పీ, ఆర్‌డబ్ల్యూఎస్ మరమ్మతులకు నిధులు మంజూరుచేయాలని కోరారు. గ్రామాల వారీగా దెబ్బతిన్న రోడ్లు, కాలువలతో కూడిన అంచనాలతో నివేదికను అందజేశారు. మిర్చి, పొగాకు, పండ్లతోటలు దెబ్బతిన్నాయని వివరించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఆయా అంశాలను ప్రభుత్వానికి నివేదించడంతో పాటు తక్షణ అవసరాలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ న్యాయవాది

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ పి.రాజాబాబును ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జెస్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన జి.శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబును కలిసి బొకే అందజేశారు. శ్రీకాంత్ మూడేళ్లు లేదా సర్వీసు నుంచి ప్రభుత్వం తొలగించే వరకు ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగనున్నారు.

ఉపశమన చర్యలు వేగవంతం

(5వ పేజీ తరువాయి)

మొక్కజొన్న దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. మిగతా విస్తీర్ణంలో పలు రకాల పంటలు ఉన్నాయి. దాదాపు 1.07 కోట్ల మేర పశుసంవర్ధక, ఆక్వా రంగాలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. ఇలా ఒకవైపు తాత్కాలిక మరమ్మతులు చేస్తూనే.. మరోవైపు శాశ్వత మరమ్మతులు, పంట నష్టాలపై రైతులకు సాయం కోసం నిధులు కోరుతూ ఆయా శాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. తుఫాన్ వెళ్లిపోయి వారం గడుస్తున్నా ఇంకా చాలా చోట్ల పంట పొలాల్లో నీరు ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఏసీబీ మెరుపు దాడి

(5వ పేజీ తరువాయి)

రూ.30వేలతోపాటు జనరల్ వాష్‌రూంలో ఉన్న రూ.18వేలు కలిపి రూ.48వేలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ దాడి చేసే సమయానికి 36 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. వాటికి సంబంధించిన లావాదేవీలు, నగదును కిందికి విసిరింది ఎవరు? ఎందుకు పడేశారు? వాష్ రూంలో ఉన్న నగదు ఎవరిది? ఎందుకు దాచారు? అన్న కోణాల్లో రాత్రి పొద్దుపోయే వరకూ ఏసీబీ అధికారులు విచారించారు.

జిల్లావ్యాప్తంగా కలకలం

రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం ఏసీబీ దాడులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్లు ఉలిక్కిపడ్డారు. దీంతో అన్ని కార్యాలయాల్లో అధికారులు సీట్లు వదిలి వెళ్లిపోయారు. డాక్యుమెంటు రైటర్లు వారి గదులను మూసివేశారు. దీంతో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కార్యకలాపాలు మందగించాయి. ఒంగోలులో దాడులు జరుగుతున్నాయన్న సమాచారం అందుకున్న సింగరాయకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, అక్కడి డాక్యుమెంట్ రైటర్లు, జెరాక్స్ సెంటర్ల నిర్వాహకులు, స్టాంపు వెండర్లు తమ దుకాణాలను మూసి వేసి వెళ్లిపోయారు. దీంతో ప్రతిరోజూ జనంతో కిటకిటలాడే ఆప్రాంతం బుధవారం మధ్యాహ్నం నుంచి బోసిపోయి కన్పించింది.

తురకపాలెం కార్యదర్శి సస్పెన్షన్

(5వ పేజీ తరువాయి)

ఈదుమూడి గ్రామానికి చెందిన డీవీ రంగారెడ్డి, యర్రగొండపాలెం మండలం గంగపాలెం కార్యదర్శి శివలింగమ్మ, తాళ్లూరు మండలం శివరాంపురం కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, పొదిలి మండలం మల్లవరం పంచాయతీ కార్యదర్శి ఎం.పద్మలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అసెస్‌మెంట్లకు సంబంధించి ఇంటి యజమాని ఫోన్ నంబరు కాకుండా ఒకే నంబర్ వేయడంపై వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం.

మార్కాపురం జిల్లాకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

పరిశీలనలోకి తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ నియోజకవర్గం మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లో ఉంది. అయితే కొన్ని మండలాలు మార్కాపురానికి సుదూరంగా ఉండటంతో గిద్దలూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ప్రతిపాదనపై పరిశీలన చేసినట్లు తెలిసింది. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఇదేసమయంలో కొత్తగా ఏర్పడబోయే మార్కాపురం జిల్లాలోకి శ్రీశైలంలోని మండలాలను కలపాలన్న ప్రతిపాదనను ఉపసంఘం పరిశీలనలోకి తీసుకోలేదని తెలిసింది. వివాదాస్పద అంశాలను పక్కనపెట్టి తొలుత మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తే తదుపరి మిగిలిన అంశాలను పరిశీలించవచ్చని భావించినట్లు తెలిసింది.దర్శి నియోజకవర్గంలోని మూడు, నాలుగు మండలాల వారు తమ నియోజకవర్గాన్ని ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశం జిల్లాలో ఉంచాలని కమిటీ సభ్యులకు గతంలో వినతిపత్రాలు ఇచ్చారు. అయితే ఆ విషయంపై తర్జనభర్జనలు జరిగినప్పటికీ తాళ్లూరు, ముండ్లమూరు మండలాలను కొత్తగా ఏర్పడబోయే అద్దంకి డివిజన్‌లో కలిపే అంశానికే ఉపసంఘం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించి సమగ్ర సమాచారం ఇవ్వాలని అధికారులను కోరినట్లు సమాచారం. సమావేశం అనంతరం ఉపసంఘంలోని సభ్యులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత తదితరులు మీడియాతో మాట్లాడుతూ తమ నివేదిక దాదాపు సిద్ధమైందని తెలిపారు. వచ్చే రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రికి సమర్పిస్తామని చెప్పారు.

ఐదు శాఖలు.. 12 అంశాలు!

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఐదో అంశంగా సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఆయన సూచనలు, సభ్యులైన కీలక ప్రజాప్రతినిధుల వినతి మేరకు ఇతర అంశాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. ప్రధాన శాఖలకు చెందిన జిల్లా అధికారులంతా వారి, వారి శాఖలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. ఇటీవల సంభవించిన తుఫాన్‌కు సంబంధించిన అంశాలపై కూడా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.

ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులు వాడాలి

జరుగుమల్లి (కొండపి), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులు వాడాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మాకినేని నరసింహం పిలుపునిచ్చారు. జరుగుమల్లిలో బుధవారం జరిగిన ప్రతి ఇంటా స్వదేశీ వస్తువుల వినియోగం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి కోమల్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మనిర్భర భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్వదేశీ నినాదంపై అవగాహన కలిగిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కొండపి నియోజకవర్గ కన్వీనర్ మిడసల బాలకోటయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

శంభో శంకర

జిల్లావ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

వేల సంఖ్యలో సముద్రస్నానాలు ఆచరించిన ప్రజలు

శోభాయమానంగా శివాలయాలు


త్రిపురాంతకం కొండమీదకు వెళ్తున్న భక్తులు


కొత్తపట్నం తీరంలో హారతి ఇస్తున్న మహిళలు


భైరవకోనలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అఘోరాలు

జిల్లాలో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ మాసంలో అత్యంత ముఖ్యమైన పర్వదినంగా కార్తీక పౌర్ణమిని భావిస్తారు. తీర ప్రాంతంలో బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు సముద్రస్నానాలు ఆచరించడం ప్రారంభించారు. అనంతరం మహిళలు ఒడ్డున కార్తీక దీపాలను వెలిగించటంతో ఆయా ప్రాంతాలు శోభాయమానంగా వెలిగిపోతూ కనిపించాయి. ఇక జిల్లాలోని పలు పెద్ద శైవక్షేత్రాలతో పాటు మిగిలిన శివాలయాలలో మహిళలు 365 ఒత్తులతో ఉసిరి దీపాలను వెలిగించారు. అదేవిధంగా దేవాలయాలలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి.


తర్లుపాడులోని నీలకంఠేశ్వరస్వామి


సింగరాయకొండలో కాశీవిశ్వనాథుడు


దర్శిలో...


కొత్తపట్నం తీర ప్రాంతంలో పూజలు చేస్తున్న భక్తులు


గిద్దలూరులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


త్రిపురాంతకంలో జ్వాలాతోరణంలో పాల్గొన్న భక్తులు

నేడు జిల్లా మీదుగా మంత్రి లోకేష్

టంగుటూరు టోల్‌గేట్ వద్ద స్వాగత ఏర్పాట్లలో సత్య


లోకేష్

ఒంగోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం జిల్లా మీదుగా ప్రయాణించనున్నారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో ఇటీవల మరణించిన ఆ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి సుబ్బానాయుడు కుటుంబాన్ని పరామర్శించేందుకు ఉండవల్లి నుంచి రోడ్డుమార్గంలో జిల్లా మీదుగా కావలి వెళ్లనున్నారు. కావలి వెళ్తున్న లోకేష్‌కు జాతీయరహదారిపై టంగుటూరు టోల్ గేటు వద్ద జిల్లాకు చెందిన టీడీపీ యువనేత, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య స్వాగతం పలకనున్నారు. ఉదయంఆరు గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచిబయలు దేరే లోకేష్ 7.30 గంటలకు టంగుటూరు టోల్‌గేట్ వద్దకు రానున్నారు. ఆ సమయానికి కొండపి నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులతో స్వాగతం పలికేందుకు సత్య ఏర్పాట్లు చేస్తున్నారు. కావలి నుంచి తిరుగు ప్రయాణం కూడా ఇదే మార్గంలో అయినప్పటికీ ఆ సమయంలో ఎక్కువ ఆగే అవకాశం లేనట్లు పార్టీవర్గాల సమాచారం.

క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్


సర్టిఫికెట్లు అందజేస్తున్నకలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ తైక్వాండో సమైక్య ఆధ్వర్యంలో గ్రాండ్ మాస్టార్ బీవీ రమణయ్య నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామినేషన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ పీ రాజాబాబు సర్టిఫికెట్లను అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు బ్లాక్ టెల్ట్స్‌తోపాటు మాస్టర్ డిగ్రీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడారగగంలో కూడా ప్రావీణ్యం సంపాదించినప్పుడే విద్యార్థుల ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. క్రీడారంగంలో ఉన్నత స్థానాలను అధిరోహించి దేశ ప్రతిష్టను చాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఇండియా పోర్ట్ ట్రస్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ షేక్ ఖలీఫాతుల్లాబాషా, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి కుంటి రాజేశ్వరి, ఇంటర్నేషనల్ తైక్వాండో కోచ్ ఫిఫ్త్ డాన్ చాంపియన్ షేక్ కరీముల్లా, బీజేఎంసీ జిల్లా అధ్యక్షులు పఠాన్ సాజిద్ ఖాన్, ఆదిల్ గ్రూపుఆఫ్ బిజినెస్ మేనేజింగ్ డైరెక్టర్‌షేక్ ఆదిల్ ఉన్నారు.

తీరంలో వేలాదిగా భక్తుల పుణ్యస్నానాలు

- కిక్కిరిసిన సముద్రతీరం

- పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా జిల్లాలోని సముద్ర తీర ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడిపోయింది. శివనామస్మరణతో మారుమోగిపోయింది. భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపట్నంలోని సముద్ర తీరానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. బుధవారం వేకువ జామునుంచే భక్తుల తీరానికి చేరుకున్నారు. తీరం వద్ద ఇసుకతో సైకత లింగాలను తయారు చేసి పూజలు నిర్వహించారు. తీరం వద్ద ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మెరైన్ పోలీసులు భక్తులు మరీ సముద్రం లోపలకు వెళ్లి స్నానాలు చేయకుండా మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. సముద్ర స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు కొత్తపట్నంలోని ప్రసిద్ధ శివాలయంతో పాటు ఆదికేశవస్వామి, రాజగోపాలస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఈ నేపథ్యంలో కొత్తపట్నం-ఒంగోలు రహదారిలో వాహనాల రద్దీ పెరిగింది. సాయంత్రం వరకు భక్తులు తీరానికి స్నానాలు ఆచరించేందుకు వస్తూనే ఉన్నారు. జేసీ గోపాలక్రిష్ణ తీరం వద్దకు చేరుకుని పర్యవేక్షించారు. పోలీసులు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఆర్టీసీ అధికారులు తీరం వద్దకు ప్రత్యేకంగా బస్సులు నడిపారు. పోలీసులు భక్తులకు అడుగడుగునా సలహాలు సూచనలు అందజేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తహసీల్దారు కె.శాంతి, ఎస్‌ఐ సుధాకర్ తీరం వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

ఐటీ కోర్ టీమ్ సీఐగా వెంకటేశ్వరరావు

ఒంగోలు క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఐటీకోర్ టీమ్ సీఐగా వెంకటేశ్వరరావును నియమిస్తూ గుంటూరు రేంజీ ఐజీ సర్వశేష్ఠిత్రిపాఠి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. అదే విధంగా ప్రస్తుతం ఐటీ కోర్ టీమ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సూర్యనారాయణను వీఆర్‌కు పంపిస్తూ అందులో పేర్కొన్నారు.

రెండో రోజూ ముమ్మరంగా వాహన తనిఖీలు

19 కేసుల నమోదు.. 9 వాహనాలు సీజ్

ఒంగోలు క్రైం, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం కూడా మొత్తం 39 బృందాలు తనిఖీలలో పాల్గొన్నాయి. ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మొత్తం 1,460 వాహనాలను తనిఖీ చేసి 19 వాహనాలపై కేసులు నమోదు చేసి తొమ్మిదింటిని సీజ్ చేశారు. అంతే కాకుండా రూ.27,500 జరిమాన విధించారు. పాఠశాల బస్సులు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, లారీలను పోలీసు బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. రహదారి నిబంధనలకు అనుగుణంగా వాహనాలు ఉన్నాయా, లేక ఏదైనా డిజైన్‌లో మార్పులు చేశారా అని పరిశీలిస్తున్నారు. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకొని వాహనాల తనిఖీలు చేపట్టామని పోలీసులు చెప్పారు. నిరంతరం తనిఖీలు చేస్తుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

బండ్లమూడిలో పోలీసు కవాతు

డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలన

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : డీఎస్పీ

ఒంగోలు క్రైం, నవంబరు5(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం బండ్లమూడిలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం చీమకుర్తి సీఐ దాసరి ప్రసాద్‌తో కలిసి బండ్లమూడిని సందర్శించారు. అక్కడ పరిస్థితులను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు.. ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగేందుకు అవకాశం లేదన్నారు. కేవలం వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ మాత్రమేనని పేర్కొన్నారు. గ్రామంలో పోలీసుల గస్తీ ఏర్పాటు చేశామని తెలిపారు. వివాదాలు రేకెత్తించే విధంగా సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రోన్ కెమెరాల ద్వారా పరిస్థితులను అంచనా వేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రెండు కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నామని వివరించారు.

చీమకుర్తిలో యథేచ్ఛగా వాగుల ఆక్రమణ


బస్టాండ్ సెంటర్ సమీపంలో వాగును ఆక్రమించి సాగిస్తున్న నిర్మాణం

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలో స్థలాల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో ఆక్రమణదారుల కన్ను వాగులు, పోరంబోకు భూములపై పడింది. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ సమీపంలోని నవాబుపేటలో ప్రధాన వాగును ఆక్రమించుకొని ఒడ్డునే సాగిస్తున్న నిర్మాణాలను అడ్డుకోవాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు కమిషనర్ రామకృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఆక్రమణ స్థలాన్ని పరిశీలించారు. వాగులు ఆక్రమణలకు గురికాకుండా తగు చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు.

యూనియన్ జిల్లా అధ్యక్షుడుగా నారాయణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా పొగడ్త నారాయణ నియమితులయ్యారు. ఒంగోలులోని యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నారాయణకు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్యాగరాజు నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లాలో యూనియన్‌ను బలోపేతం చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్‌మాదిగ, విజయ్‌కుమార్, అప్పారావు, ఆదాం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అవసరం ఇక్కడ.. ఆఫీసు అక్కడ!

ఉమ్మడి రాష్ట్రం నుంచి శ్రీశైలంలోనే ఐటీడీఏ ప్రాజెక్ట్

ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోనే అధికంగా చెంచులు

అందుబాటులో ఉండేలా చూడాలంటున్న గిరిజనులు

కొత్త జిల్లాల ప్రతిపాదన నేపథ్యంలో దోర్నాలలో ఏర్పాటుకు వినతి

మంత్రుల కమిటీ ముందుకు ప్రతిపాదన


శ్రీశైలంలోని ఐటీడీఏ కార్యాలయ భవనం

త్రిపురాంతకం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి శ్రీశైలంలో కొనసాగుతున్న సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రాజెక్ట్ కార్యాలయాన్ని దోర్నాలలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన బలంగా వినిపిస్తోంది. చెంచులు అధికంగా ఉన్న ప్రకాశం, గుంటూరు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించేలా సౌకర్యవంతంగా ఉంటుందనే ప్రతిపాదన ఇప్పుడు తాజాగా కొత్తగా ఏర్పడే మార్కాపురం జిల్లా నేపథ్యంలో తెరమీదికి వచ్చింది. ఇదే విషయాన్ని జిల్లా ఏర్పాటు కోసం ఏర్పాటైన మంత్రుల కమిటీ దృష్టికి కూడా తీసుకెళుతున్నట్లు స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు తెలియజేస్తున్నారు.

గిరిజన తెగలో ఒకటైన చెంచు కుటుంబాల అభివృద్ధి కోసం 1970లో ఏర్పాటైన ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐటీడీఏ) ప్రధాన కార్యాలయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలంలో ఏర్పాటైంది. ఈ ప్రాజెక్ట్ పరిధిలో నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాలు ఉండేవి. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలోని ఉమ్మడి మూడు జిల్లాలు నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ విడిపోగా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు సంబంధించి అప్పుడు శ్రీశైలంలోని ఐటీడీఏ కార్యాలయంలో కొనసాగుతోంది. ఐటీడీఏ ద్వారా చెంచుల కోసం పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రత్యేక బడ్జెట్‌ను వారికోసం రూపొందించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. ముఖ్యంగా చెంచు గిరిజనుల విద్య, వైద్యం, ఉపాధి కోసం ప్రత్యేకంగా ఈ ప్రాజెక్ట్ ద్వారానే పనులు చేపడతారు. అటువంటి ప్రాజెక్ట్ శ్రీశైలంలో ఉండడం వల్ల ప్రకాశం, గుంటూరు జిల్లా గిరిజనులు ఏదైనా అవసరాల నిమిత్తం లేదా గ్రీవెన్స్ కోసం కార్యాలయానికి వెళ్లాలంటే చాలా దూరంతో పాటు వ్యయంతో ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రంలోని చెంచు కుటుంబాల్లో 59శాతం ఇక్కడే

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గిరిజన కుటుంబాలు కొద్దిగానే ఉండగా ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న మొత్తం చెంచు కుటుంబాల్లో 59శాతం కుటుంబాలు ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోనే ఉన్నాయని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. అందులో కూడా ప్రకాశం జిల్లాలోనే అధికం. ముఖ్యంగా నల్లమల పరిధిలో గూడేలన్నీ ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో మరీ ముఖ్యంగా ఎర్రగొండపాలెం, దోర్నాల, పుల్లలచెరువు మండలాల పరిధిలోనే ఉన్నాయి. మరికొన్ని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఉన్నాయి. అంటే మొత్తంగా పశ్చిమ ప్రకాశంలోనే అత్యధికంగా చెంచు కుటుంబాలు నివాసముంటున్నాయి. వారి అభివృద్ధి కోసం ఉన్న ఐటీడీఏ కార్యాలయం మాత్రం శ్రీశైలంలో కొనసాగడం ద్వారా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వారి ప్రతినిధులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తూనే ఉన్నారు. రాష్ట్ర విభజన తరువాతైనా మారుస్తారని భావించినా అది జరగలేదని నిరాశతో ఉన్నారు.

మార్కాపురం జిల్లాతో మళ్లీ తెరపైకి...

ప్రస్తుతం ప్రభుత్వం కొత్త జిల్లాల ప్రతిపాదన తీసుకురావడం, అందులో మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించడంతో మళ్లీ ఐటీడీఏ కార్యాలయ మార్పు అంశం తెరమీదికి వచ్చింది. గిరిజనులు అధికంగా ఉన్న ప్రకాశం, గుంటూరు జిల్లాల వారికి అందుబాటులో ఉండేలా దోర్నాల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని ప్రజాప్రతినిధులు కూడా ఇటీవల జిల్లా ఏర్పాటు కోసం ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. గతంలోనే ఈ ప్రతిపాదన రావడంతో ఇక్కడి గిరిజనుల నుంచి గ్రీవెన్స్ తీసుకునేందుకు దోర్నాలలోని వెలిగొండ గెస్ట్‌హౌస్‌లో ఒక గదిని అందుకోసం తాత్కాలిక కార్యాలయంగా వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు మార్కాపురం జిల్లా కానున్న క్రమంలో ఐటీడీఏ కార్యాలయాన్ని దోర్నాలలో ఏర్పాటు చేయాలని అందరూ బలంగా కోరుకుంటున్నారు.

కమిటీ దృష్టికి తీసుకెళతా

ఎరిక్షన్‌బాబు, టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి

ఐటీడీఏ కార్యాలయ ఏర్పాటు విషయాన్ని చెంచు గిరిజన నాయకులు నా దృష్టికి తీసుకొచ్చారు. చెంచులు అధికంగా ఉన్న ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అందుబాటులో ఉండేలా దోర్నాలలో ఏర్పాటు చేయడం సరియైనదే. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సరిహద్దులు, ఇతర అంశాలపై అధ్యయనం చేయడానికి నియమించబడిన మంత్రుల కమిటీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి పరిశీలించాలని కోరతా.

అటవీ ప్రాంతంలో గడ్డి మైదానాన్ని పెంపొందించాలి


సిబ్బందితో ఎఫ్‌డీ విజయ్‌కుమార్, డీఎఫ్‌వో రవూఫ్ బాషా

పెద్ద దోర్నాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు అటవీ ప్రాంతంలో గడ్డి మైదానాన్ని పెంపొందించాల్సి బాధ్యత అందరిపై ఉందని ఎఫ్‌డీ విజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద ఆ శాఖ విశ్రాంతి భవనంలో మార్కాపురం డివిజన్‌లోని అటవీ శాఖ సిబ్బందికి మార్కాపురం డీఎఫ్‌వో రవూఫ్ బాషా అధ్యక్షతన నల్లమలలో గడ్డి పెంపుదలపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎఫ్‌డీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణం పది కాలాల పాటు పచ్చగా ఉండాలంటే వన్యప్రాణుల మనుగడకు కావలసిన ఆహారం సమృద్ధిగా లభించాలన్నారు. తద్వారా చిరుతలు, పెద్దపులులు సంఖ్య వృద్ధి చెందుతుందని తెలిపారు. అందుకుగానూ బాధ్యతగా పని చేయాలన్నారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బంది ఎక్కడ గడ్డి మైదానాలు ఎక్కువగా ఉన్నాయి, ఎక్కడ లేవు తదితరవి గుర్తించి ఆ ప్రదేశాలలో గడ్డిని అది కూడా బలవర్ధకమైన గడ్డి పెంపుదలకు కృషి చేయాల్సి ఉందన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అటవీ శాఖ అధికారులందరూ సమన్వయంతో ప్రత్యేక రూపకల్పన చేసి ఆయా సీజన్లలో సహజ సిద్ధంగా అటవీ ప్రాంతంలో లభించే వివిధ జాతులకు చెందిన గడ్డి నుంచి విత్తనాలను సేకరించి తిరిగి గుర్తించిన మైదానాల్లో చల్లాలని, పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ డాక్టర్ జీడీ మురాట్కర్ గడ్డి పెంపుదలకు తీసుకోవాలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దోర్నాల రేంజి అధికారి హరి, కొర్రప్రోలు రేంజి అధికారి రహంతుల్లా సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో వాన..!

ఒంగోలు నగరంలో వాన మళ్లీ కురిసింది. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా నగరం జలమయం కాగా, వారం రోజులు కాకముందే మరోసారి వాన ఓ గంటసేపు దంచికొట్టింది. దీంతో నగరంలోని పలు వీధుల్లో కొద్దిసేపు నీరు నిలిచింది. ఈక్రమంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజలు చేసేందుకు శైవ క్షేత్రాల వద్ద బారులు తీరిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటసేపు వానకు వీధులన్నీ నిర్మానుష్యంగా మారగా, ఆ తర్వాత తెరపివ్వడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)



కొత్తపట్నం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ప్రవహిస్తున్న వర్షపునీరు

పుస్తకాల ర్యాక్‌ల అందజేత

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు ఐదు పుస్తకాల ర్యాక్‌లను బహూకరించారు. దాత గట్టిబోయిన నరసింహారావు అందించిన వాటిని ఒంగోలులోని జీఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద స్వీకరించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ తంగెళ్ళ, ఆలూరు జడ్పీ హైస్కూలు, ఒంగోలు బాలాజీ నగర్‌లోని మునిసిపల్ హైస్కూలు, చేవూరు జడ్పీ హైస్కూలుకు వాటిని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రావిపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీరామమూర్తి, రీజనల్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

నాగులుప్పలపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్.సునీల్ బుధవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

8,9తేదీల్లో ఎల్ఐసీ ఏజెంట్ల మహాసభలు

ఒంగోలు(రూరల్), నవంబరు5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో ఈనెల 8,9తేదీల్లో జరిగే ఎల్ఐసీ ఏజెంట్ల మహాసభలను జయప్రదం చేయాలని ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా నెల్లూరు డివిజన్ కార్యదర్శి బి.వెంకట్రావు కోరారు. బుధవారం ఒంగోలులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మద్దిపాడు విద్యార్థిని ప్రతిభ



స్రవంతిని సత్కరిస్తున్న అధ్యాపకులు

మద్దిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జిల్లాస్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని గుంటూరు స్రవంతి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో స్రవంతిని అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల నుంచి 39 మంది పోటీపడగా స్రవంతికి ప్రథమస్థానం లభించిందని వారు పేర్కొన్నారు.

వైసీపీ నేతల పరామర్శ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న చీమకుర్తి మండలం బండ్లమూడికి చెందిన దళితులను వైసీపీ నాయకులు బుధవారం మధ్యాహ్నం పరామర్శించారు. మాజీమంత్రి మేరుగ నాగార్జున, నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు బాధితులతో ఘటనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేవీ.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు



చెన్నకేశవస్వామి ఆలయంలో జ్వాలాతోరణం



కొత్తపట్నం రోడ్డులో జ్వాలాతోరణం వేడుకల్లో పాల్గొన్న భక్తులు

- నయన మనోహరంగా జ్వాలా తోరణం
- భారీగా పాల్గొన్న భక్తులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట శ్రీగంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, తూర్పుపాలెం శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు శ్రీ పంచముఖ శివాలయం, రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న శ్రీ అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరం శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిరం శ్రీ మరకత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, మంగమూరురోడ్డు శ్రీఅచలానంద ఆశ్రమం, సుందరనగర్ శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, కేశవస్వామిపేట శ్రీవిజయ దుర్గా దేవస్థానం మొదలైన పలు ఆలయాలలో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించగా పెద్దసంఖ్యలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక రాత్రి పలు శివాలయాల్లో ఏర్పాటు చేసిన జ్వాలాతోరణ మహోత్సవం భక్తుల కోలాహలం నడుమ నయన మనోహరంగా సాగింది. స్థానిక కేశవస్వామిపేట శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అర్చకులు శంకరమంచి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో తోరణంగా దీపాలను ఏర్పాటుచేసి అనంతరం వాటిని వెలిగించారు. పెద్దసంఖ్యలో భక్తులు, మహిళలు హరహర శంభో శంకర మహాదేవ అంటూ జ్వాలాతోరణాన్ని దాటుతూ పరవశులైనారు. ఈవో రావెళ్ల శివశంకర్ పర్యవేక్షించారు. అటు స్థానిక తూర్పుపాలెం శ్రీ గంగాపార్వతీ సమేత రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు మణికంఠశర్మ యాజ్ఞీకంలో జ్వాలాతోరణ మహోత్సవం జరిగింది. ఈవో బోడపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. మరోవైపు శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సైతం కార్తీక దీపోత్సవం మనోహరంగా జరిగింది. ప్రధాన అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఇతర ప్రతినిధిలు పర్యవేక్షించారు.

మర్రిపూడి మండలంలో..



మర్రిపూడి శివాలయంలో దర్శనం కోసం భారులు తీరిన భక్తులు

మర్రిపూడి: కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళలు తెల్లవారి జామునే లేచి కార్తీక స్నానాలు ఆచరించి దేవాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించుకున్నారు. మండలంలోని మర్రిపూడి, కూచిపూడి, తంగెళ్ల, రామాయపాలెం, కెల్లంపల్లి గ్రామాల్లో ఉన్న శివాలయాలకు స్వామి దర్శనం కోసం భక్తులు పెద్దఎత్తున బారులు తీరారు. ప్రతినెల పౌర్ణమి రోజు జరిగే పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి ఏకాహ భజన చీమకూర్తి శ్రీను స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. భజనా కార్యక్రమానికి పరిసర ప్రాంత ప్రజలు వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులందరికీ నిర్వాహకులు భోజనం సదుపాయం కల్పించారు. మర్రిపూడి అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు చేసి పడిపూజ చేశారు. కార్తీక దీపాల కాంతులలో దేవాలయాలు శోభాయమానంగా వెలుగొందాయి.

శ్రీసంగమేశ్వరస్వామి దేవాలయంలో..

పొన్నలూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా పొన్నలూరు మండలం చెన్నుపాడు సమీపంలోని శ్రీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు పోటెత్తారు. పాలేరు, మాకేరు నదుల సంగమ స్థానంలో స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం బారులు తీరారు. ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు, అభిషేకాలు చేశారు. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. వేలసంఖ్యలో భక్తులు రాకతో ఆ ప్రాంతమంతా శివనామ స్మరణతో మారుమోగింది. అన్నదానం చేపట్టారు.

ఉపాధి హామీ కార్యాలయం ప్రారంభం

నాగులుప్పలపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులో ఉపాధి హామీ పథకం కార్యాలయ భవనాన్ని ఎంపీపీ నలమలపు అంజమ్మ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేసు, ప్రత్యేకాధికారి జి.జోసఫ్‌కుమార్, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, ఏవో మూర్తి, కృష్ణారెడ్డి, మారెళ్ల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో మొంథా తుఫాన్ బాధితులను ఆదుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జి.రమేష్, తంబి శ్రీనివాసులు, భావన్నారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా ఒంగోలు నగరంలో పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో మంగమూరురోడ్డు, జడ్పీ కాలనీ, కొత్తడొంక, జర్నలిస్టుకాలనీ, మర్రిచెట్టుకాలనీ, ప్రగతినగర్, గాంధీనగర్ ఎక్స్‌టెన్షన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చెత్తను క్లాప్‌మిత్రలకు అందించాలి

టంగుటూరు (కొండపి) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గృహ యజమానులు తడిచెత్త, పొడిచెత్తలను వేరుచేసి క్లాప్‌మిత్రలకు అందించాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం కందులూరు గ్రామంలో డీపీవో పరిశుభ్రత, నీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణను ఆయన పరిశీలించారు. ప్రతి ఇల్లూ, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేసే విధానాన్ని ఓ వీధిలో ప్రదర్శింపజేశారు. వాటర్ ట్యాంకును ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు.

మండల ఉప అభివృద్ధి అధికారిగా రాఘవరావు



తర్లుపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు మండల ఉప మండల అభివృద్ధి అధికారిగా జి.రాఘవరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు గిద్దలూరు మండలం కష్ణంశెట్టిపల్లె పంచాయతీ కార్యదర్శిగా ఆయన పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

భక్తిభావంతో దీక్ష కొనసాగించాలి

రాచర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దీక్షధారులు భక్తి భావంతో దీక్ష కొనసాగించాలని ఎస్‌ఐ పీ కోటేశ్వరరావు అన్నారు. అయ్యప్ప స్వామి ఆలయంలో దీక్షధారులకు బుధవారం ఆయన అన్నదానం ఏర్పాటు చేశారు. నిష్టతో దీక్షను ముగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు



మహిళా సమాఖ్య భవనం



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్



రైతు సేవా కేంద్రం

- యథేచ్ఛగా అసాంఘిక కార్యక్రమాలు
- వైసీపీ నిర్లక్ష్యమే కారణమంటున్న ప్రజలు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

రాచర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో రాచర్లకు 2019లో దాదాపు రూ.72లక్షల నిధులతో ఉపాధి హామీ, మహిళా సమాఖ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, రైతు సేవా కేంద్రాలు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.32లక్షలతో ఉపాధి హామీ, మహిళా సమాఖ్య భవనాలు మంజూరు కాగా, పంచాయతీ రాజ్ నిధులు రూ.21.80లక్షలతో రైతు సేవా కేంద్రం, రూ.17.50లక్షలతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాలు మంజూరై పనులు కూడా ప్రారంభించారు. 2019లో ప్రారంభించినా నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో అవి నేటికీ ప్రారంభానికి ఉండడంతో అవి నిరుపయోగంగా మారి ఆ భవనాల్లో అసాంఘిక కార్యక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. 2019లో ప్రారంభమైన నిర్మాణాలు 2024 వరకు కూడా పూర్తి చేయకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థంకాని ప్రశ్నగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి భవన నిర్మాణాలు చేపట్టినా అవి పూర్తికాక వినియోగంలోకి రాకపోవడంతో సంబంధిత శాఖలకు సంబంధించిన ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది విధుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కొన్ని శాఖలకు సంబంధించి అద్దె భవనాల్లో, మరికొందరు వేరే శాఖకు సంబంధించిన భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ భవనాలు కూడా చాలావరకు దెబ్బతిన్నాయి. విధిలేక విధులు నిర్వహిస్తున్నామని కొందరు సిబ్బంది బాహాటంగా తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రారంభానికి నోచుకోని భవనాలు పరిశీలించి నిర్మాణ కార్యక్రమాలు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకొని త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



శ్రీశైలం రోడ్డులో బారులు తీరిన వాహనాలు

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

పెద్ద దోర్నాల : శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం, పైగా పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు శ్రీశైలానికి పోటెత్తారు.దీంతో దోర్నాలలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భక్తులతో రద్దీ ఏర్పడింది. కార్తీక పౌర్ణమి రోజున శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు చాలా దూరం నుంచి భక్తులు శ్రీశైలానికి వెళ్లేందుకు మంగళవారం నాడే దోర్నాలకు చేరుకున్నారు. ప్రభుత్వం మహిళలకు కొన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచితం కావడంతో అధిక సంఖ్యల్లో ప్రయాణాలు చేస్తున్నారు. ఈక్రమంలో రాత్రి 9గంటలు దాటితే నల్లమలలో ప్రయాణం నిషేధం కావడంతో ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద వాహనాలు భారీ సంఖ్యల్లో నిలిచిపోయాయి. ఉదయం 6గంటలకు అనుమతులిచ్చే సరికి వాహనాలు ముందుగా వెళ్లే క్రమంలో కొంత సేపు అంతరాయం ఏర్పడింది. దీంతో ఫారెస్టు అధికారులు, ఎస్‌ఐ మహేష్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పాటించడంతో యథావిధిగా వాహనాలు రాకపోకలు కొనసాగాయి.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలి

పెద్దారవీడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బద్వీటి చెర్లోపల్లి సచివాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. పారిశుధ్యం, ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్, చెత్త విషయంలో మైక్ బండ్లతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా లేదా అన్న విషయాలను పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటి పన్ను వసూలుకు సంబంధించి ప్రతి రోజు ప్రతి వ్యక్తి 20 ఇళ్లకు తగ్గకుండా పన్ను వసూలు చేయాలన్నారు. సమాచారం హక్కు చట్టం బోర్డులు ప్రతి సచివాలయంలో ఉండాలన్నారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



సుప్రజ

కంభం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంలో ఇంటర్ స్థాయి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్ సీఈసీ విద్యార్థిని జడ్డా సుప్రజ జిల్లా స్థాయి రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ సైమన్ విక్టర్ బుధవారం తెలిపారు. పలు అంశాలపై జిల్లా, జోనల్ స్థాయిలో వ్యాస రచన, వకృత్వ, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈనెల 3, 4వ తేదీలలో కళాశాల స్థాయిలో జరిగిన పోటీలలో విజేతలకు బుధవారం ఒంగోలులో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. వ్యాసరచనలో సుప్రజ ద్వితీయ స్థానం పొందిందన్నారు. ఆమె క్విజ్ పోటీల్లో జిల్లా స్థాయిలో మూడవ స్థానం పొందిన జట్టులో భాగస్వామ్యమై విజేతగా నిలిచిందన్నారు. 7వ తేదీ శుక్రవారం జోన్ స్థాయిలో జరిగే పోటీలో సుప్రజ పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభను చూపిన సుప్రజను మార్గదర్శకత్వం వహించిన హిస్టరీ లెక్చరర్ తిరుపాలును, కళాశాల ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్ అభినందించారు.

విశ్వనాథపురం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులతో పీడీ కోటేశ్వరరావు

త్రిపురాంతకం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో జరిగిన డివిజన్ స్థాయి పాఠశాల ఆటల పోటీల్లో విశ్వనాథపురం విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల పీడీ కోటేశ్వరరావు తెలిపారు. లాంగ్‌జంప్‌లో టీ అమూల్య ప్రథమ స్థానంతో పాటు పలువురు విద్యార్థినులు రన్నింగ్, హైజంప్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరంతా 6వ తేదీన ఒంగోలులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోటేశ్వరరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- సామూహిక అభిషేకాలు, జ్వాలా తోరణ దర్శనం
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



పొదిలిలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న ఎమ్మెల్యే కందుల



మార్కండేయుని అలంకారంలో మార్కండేశ్వర స్వామి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు శివనామస్మరణలతో మారుమోగాయి. మార్కండేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు తెల్లవారుజామున 3 గంటల నుంచే బారులు తీరారు. అర్చకులు వరుణ్ తేజశర్మ, ఆంజనేయశర్మ జగదాంబ మార్కండేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. మార్కండేశ్వరునికి ప్రత్యేకంగా మార్కండేయుని అలంకారం నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి నవగ్రహ, నాగశిలల పూజలు చేశారు. ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈవో చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో జ్వాలాతోరణం, కోటిదీపోత్సవాన్ని నిర్వహించారు.

జ్వాలాతోరణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

పొదిలి : కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక నిర్మమహేశ్వరస్వామి దేవాలయం బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జ్వాలా తోరణం నిర్వహించారు. పౌర్ణమిరోజు దేవాలయ ప్రాంగణంలో కర్రలతో ద్వారం ఏర్పాటు చేసి వరిగడ్డి చుట్టి దానిపైన ఆవునెయ్యి పోసి వెలిగిస్తారు. జ్వాలాతోరణం ద్వారా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీసమేతంగా జ్వాలాతోరణాన్ని లాంఛనంగా వెలిగించారు. అనంతరం టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్ 20 క్వింటాళ్ల బియ్యంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈవో నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య ఏర్పాట్లు చేశారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని తిప్పాయపాలెం గ్రామం వద్ద కొండపై వెలసిన మునీశ్వరాలయంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి స్వామి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బొడిచెర్ల, వేమలకోట శివాలయాలలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.

తర్లుపాడు : తర్లుపాడులోని నీలకంఠేశ్వర స్వామి, కేదేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

గిద్దలూరు : కార్తీక పౌర్ణమి వేడుకలు దేవాలయాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీపాతాల నాగేశ్వరస్వామి దేవస్థానానికి, పలుపులవీడు, ముండ్లపాడు, భీమలింగేశ్వరస్వామి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారికి అభిషేకాలు చేశారు. శ్రీకుసుమ హరనాథ క్షేత్రంలో సుమారు 80 మంది దంపతులు శివునికి సామూహికంగా రుద్రాభిషేకం చేశారు. కాగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈక్షేత్రాలతోపాటు అమ్మవారిశాల, అంజనేయస్వామి దేవాలయం, నాగమయ్య దేవాలయం, ఇతర ఆలయాలలో జ్వాలాతోరణ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించగా వేలసంఖ్యలో భక్తులు జ్వాలతోరణాన్ని వెలిగించి పూజలు నిర్వహించారు. పలు ఆలయాలలో కోటి దీపోత్సవ కార్యక్రమం సామూహికంగా కార్తీక దీపాలను వెలిగించారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాలలోని పలు దేవాలయాలలో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివాలయాల్లో దీపాలను వెలిగించి స్వామికి అభిషేకాలు చేశారు. శివాలయంతోపాటు శ్రీవేంకటేశ్వరాలయం, చిన్న కంభంలోని వీరభద్రస్వామి, తురిమెళ్లలోని కనక సురభేశ్వర ఆలయం, కోటిలింగాలతో శివపార్వతుల మూర్తులు, గుండికా నది ఒడ్డున వెలసిన కోటేశ్వర స్వామి దేవాలయం, రావిపాడులో వీరభద్ర స్వామి దేవాలయం, శ్రీ కోటా సత్యమాంబ, అర్ధవీడు మొహిద్దీన్‌పురంలో కల్పనేశ్వర స్వామి దేవాలయం, నాగులవరం కొండపై శివాలయం, యాచవరంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

రాచర్ల : కార్తీక పౌర్ణమి సందర్భంగా సత్యవోలు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయం, రామాపురంలోని శ్రీ సిద్ధిభైరవేశ్వర ఆలయం, అక్కపల్లె గ్రామంలోని శ్రీ కనక సురభేశ్వర ఎల్లమ్మ కోన, రాచర్ల గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి పూజలు చేశారు. పోలీసులు, ఆలయ కమిటీలు ఏర్పాట్లను చేశారు. ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, ఎస్‌ఐ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు జి ప్రతాపరెడ్డి, టి గణేష్, వైఎన్‌జీ రంగనాయకులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : కాశీవిశ్వేశ్వర స్వామి, వృశ్చికాల మల్లయ్య, రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు చేశారు. పురాతన కోనేరు వద్ద బుధవారం రాత్రి మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : బోయలపల్లి, కొలుకుల, అయ్యంబొట్లపల్లి, స్థానిక శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. తెల్లవారుజామున నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు.

పుల్లలచెరువు : కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భవానీశివ, చాపలమడుగు ఉమామేశ్వరస్వామి, శతకోడు సప్తకోటేశ్వరస్వామి ఆలయాలతోపాటు గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

త్రిపురాంతకానికి పోటెత్తిన భక్తులు

త్రిపురాంతకం : త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర స్వామి దేవాలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. కొండపైకి వెళ్లేందుకు మెట్లమార్గం ద్వారా క్యూకట్టారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు అభిషేకాలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎక్కువమంది రావడంతో ఇబ్బందులు తలెత్తకుండా సీఐ అస్సాన్ ఆధ్వర్యంలో త్రిపురాంతకం, దొనకొండ ఎస్‌ఐలు శివబసవరాజు, త్యాగరాజులు బందోబస్తు నిర్వహించారు. పలువురు గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం జ్వాలాతోరణ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొన్నారు.

దోర్నాల : కార్తీకపౌర్ణమి సందర్భంగా శైవ క్షేత్రా లు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం కార్తీక దీపాలతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం, సాయిబాబా మందిరం, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంతో పాటు మోట్ల మల్లికార్జునస్వామి దేవాలయంలో, మండలంలోని అన్ని దేవాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి భక్తితో సేవించారు.



శివాలయం కోనేరు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చిన్నకంభంలో శివపార్వతులకు పూజలు చేస్తున్న మహిళా భక్తులు

రైతు సేవా కేంద్రాల్లో పంట నష్టం జాబితా ప్రదర్శన



త్రిపురాంతకంలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

మార్కాపురం రూరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటల జాబితాను రైతు సేవా కేంద్రంలో ప్రదర్శనలో ఉంచినట్లు ఏడీఏ బాలాజీనాయక్ తెలిపారు. మండలంలోని నికరంపల్లి గ్రామంలోని రామాలయం వద్ద బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ మార్కాపురం డివిజన్‌లో పంట నష్టం అంచనా విలువ రూ.11.043కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పంట నమోదు అయిన రైతులకు మాత్రమే పరిహారం అందుతుందని తెలిపారు. డివిజన్‌లో పత్తి, వరి, కంది, మినుము, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వేమలకోటలో ఏవో బుజ్జిబాయి కార్యక్రమం నిర్వహించారు.

అనుమతి ఉంటేనే పొగాకు సాగు చేయాలి

పెద్దారవీడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో పొగాకు సాగుచేయాలంటే రైతులు కంపెనీల నుంచి అనుమతి కాపీలను తప్పక తీసుకున్న తర్వాతనే సాగుచేయాలని ఏవో లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బద్వీటి చెర్లోపల్లి రైతుసేవా కేంద్రం పరిధిలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో సాగుచేసిన పంటలను పరిశీలించిన అనంతరం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రబీలో సాగుచేయబోయే మొక్కజొన్నకు కూడా ఒప్పంద పత్రాలు తీసుకోవాలన్నారు. ఒప్పందపత్రాలు లేకుండా పొగాకు, మొక్కజొన్న సాగుచేస్తే కొనుగోలు సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను రైతు సేవా కేంద్రాల పరిధిలో ప్రదర్శించిందన్నారు. తప్పులుంటే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వి.సౌజన్య, వీఏఏ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో మొవ్వుపురుగు

త్రిపురాంతకం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నలో మొవ్వుపురుగు కనిపిస్తుందని నివారణకు ఎకరాకు 5కిలోల ఫోరెట్ గుళికలు వాడాలని వ్యవసాయాధికారి బి.సంగమేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మిరియంపల్లి, కంకణాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వరిలో ఆకుచుట్టు పురుగు, రసంపీల్చు పురుగు ఉన్నట్టు గుర్తించి రైతులకు నివారణ చర్యలు వివరించారు. ఆకుముడత యూరియా అధికంగా వాడటం వల్ల సంక్రమించిందని చెప్పారు. రసం పీల్చే పురుగు నివారణకు కార్టాప్ గుళికలు వాడడం లేదా క్లోరోపైరిఫాస్ లీటరు నీటికి 5ఎం.ఎల్ చొప్పున పిచికారి చేయాలన్నారు.



కంభంలో వరి పైరుపై పిచికారీ చేస్తున్న డ్రోన్

డ్రోన్లతో పిచికారీ

కంభం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలువురు రైతులు తమ వ్యవసాయ పొలాలకు తక్కువ సమయంలో డ్రోన్ల ద్వారా మందులను పిచికారీ చేయించుకుంటున్నారు. ప్రస్తుతం కంభం చెరువు కింద రైతులు వందల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. వరి పంటకు తెగుళ్లు రాకుండా వాటి నివారణకు మందులను పిచికారీ చేసే డ్రోన్లను తెప్పించుకుంటున్నారు. 12లీటర్ల మందును ట్యాంకర్ సామర్థ్యంగల డ్రోన్ కేవలం 15నిమిషాల్లో ఎకరా పంటకు పిచికారీ చేస్తుంది. డ్రోన్ యజమాని రమేష్ మాట్లాడుతూ ఎకరా పంటకు మందు కొట్టాలంటే నలుగురు కూలీలకు రూ.2వేలు ఇవ్వాల్సి వస్తుందని అదే డ్రోన్ ద్వారా 15నిమిషాల్లో ఎకరాకు పిచికారీ చేస్తే కేవలం రూ.400 ఖర్చవుతుందన్నారు. గంటలో 15ఎకరాలకు మందును పిచికారీ చేస్తుందని తెలిపారు.

వృత్తివిద్య నైపుణ్య పోటీలు

గిద్దలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో వృత్తి విద్య నైపుణ్య పోటీలు నిర్వహించారు. వృత్తి విద్య నేర్చుకోవడం ద్వారా జీవితంలో ఎన్నో ఉపాధి అవకాశాలు పొందవచ్చని అన్నారు. సోలార్ కమ్యూనికేషన్ ప్రాజెక్ట్, బ్యూటీ, వెల్‌నెస్, అపరల్ ఎస్టాబిలిటీ స్కిల్స్ విభాగాలలో పోటీలు నిర్వహించగా పలువురు జిల్లాస్థాయి పోటీలకు కూడా ఎంపికయ్యే విధంగా ప్రతిభ చూపారు. కార్యక్రమంలో ఎంఈవోలు అశ్వనీకుమార్, నాగభూషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కందిలో వెర్రి తెగులు నివారణకు చర్యలు

పొదిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ దాటికి మండలంలో సాగుచేసిన కందిలో వెర్రితెగులు ఆశించిందని వ్యవసాయాధికారి డీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ తెగులు నల్లి ద్వారా వ్యాప్తి చెందుతుందని దాని నివారణకు ఓమైట్ అనే మందును లీటరు నీటిలో 2ఎంఎల్ మందులు కలిపి పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా ఎండుతెగులు ఆశించిచే ప్రమాదం కూడా ఉందన్నారు. తుఫాన్ దాటికి సజ్జ 84హెక్టార్లలో, వరి 12, పత్తి 12 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు.

ఉపాధి కార్మికులు ఈకేవైసీ చేయించుకోవాలి

పెద్ద దోర్నాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ శ్రామికులు ఈకేవైసీని చేయించుకోవాలని ఇన్‌చార్జి ఏపీవో చాణిక్య బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జాబు కార్డులున్న ప్రతి ఒక్కరూ విధిగా ఈనెల 7వ తేదీలోపు మీ గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా ఈకేవైసీ చేయించుకోక పోతే కార్డులు తొలగించబడునని, తద్వారా ఉపాధి హామీ పథకం ద్వారా ఎటువంటి ప్రభుత్వ పథకాలు లభించవన్నారు.

పత్రాలు లేకపోతే కేసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వేమన

పొదిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వాహనాలకు సరైన పత్రాలు లేకపోతే కేసులు తప్పవని ఎస్‌ఐ వేమన హెచ్చరించారు. బుధవారం స్థానిక మార్కాపురం, దొనకొండ అడ్డరోడ్డు ప్రాంతాల్లో లారీలు, ట్రావెల్స్ బస్సులు ఇతర వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు.

కార్పొరేట్ శక్తులను ప్రతిఘటించాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశసంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ శక్తులను ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుబ్బారావు పిలుపునిచ్చారు. ఎన్జీవో హోంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి కార్యకర్తల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు బాలనాగయ్య, నాయకులు పాల్గొన్నారు.

మిద్దె పెచ్చులూడి మహిళకు గాయాలు

పెద్ద దోర్నాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మిద్దె పెచ్చులూడి తలపై పడడంతో గిరిజన మహిళకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామం బ్రహ్మంగారి మఠం గూడెంలో బుధవారం జరిగింది. ఈ ప్రమాదంలో గూడేనికి చెందిన కుడుముల మూగెమ్మకు తలపై గాయాలయ్యాయి.

కాలువలో పడి వ్యక్తి మృతి

పుల్లలచెరువు,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. శతకోడు గ్రామానికి చెందిన మాకం నాసరయ్య మద్యం సేవిస్తూ తిరుగుతుంటాడు. మంగళవారం రాత్రి ముటుకులకు వచ్చి మద్యం తాగి ఆ మత్తులో కాలువలో పడిపోయాడు. బుధవారం ఉదయం గమనించిన బంధువులకు సమాచారమివ్వగా అప్పటికే నాసరయ్య(45)మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని వినతి

మార్కాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని జడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు గాయం వెంకట నారాయణరెడ్డి బుధవారం గుంటూరు రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్ణసేన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ పథకం ఎంపిక చేసినా నేటికీ ఎలాంటి ప్రధానమైన పనులు కాలేదని నారాయణరెడ్డి తెలిపారు. శ్రీశైలం వెళ్లే యాత్రికులకు అవసరమైన సౌఖర్యాలను కల్పించాలన్నారు. పగటి వేళలో మార్కాపురం నుంచి గుంటూరు, గుంతకల్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్తేందుకు నూతన రైళ్లను ఏర్పాటు చేయాలన్నారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ఉదయం 7.00 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకునేలా సమయాలను మార్పు చేయాలన్నారు. శ్రీశైలం వెళ్లేందుకు 15 వరకు జీపుల నిర్వహణకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ స్థలం ఉన్నా రక్షణ కరవైందన్నారు. నూతనంగా షెల్టర్‌తో కూడిన పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను విన్న డీఆర్‌ఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.



డీఆర్‌ఎం సుదేష్ణసేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణరెడ్డి



భైరవకోన క్షేత్రంలో ఎమ్మెల్యే ఉగ్ర దంపతులు

భైరవకోనను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోనను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర, డాక్టర్ కవిత దంపతులు భైరవకోన క్షేత్రాన్ని బుధవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి 167-బి హైవేకు సంబంధించి పీడీఆర్ ప్రాజెక్టు కాంట్రాక్టర్ మస్తాన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లను ప్రారంభించారు. రాత్రిపూట జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నిరోధించడానికి లైటింగ్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం దేవస్థానానికి విచ్చేసిన ఉగ్ర దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా త్రీముఖ దుర్గాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్న వారిని శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, జిల్లా షీప్ సొసైటీ చైర్మన్ తోడేటి గోపి, టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రాజేష్, మాజీ అధ్యక్షుడు బి. వెంగయ్య, సింగిల్‌విండో చైర్మన్ సీహెచ్ వెంకటరెడ్డి, దేవస్థాన చైర్మన్ శ్యాంసుందర్‌రాజు తదితరులు ఉన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

- మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించటమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. పట్టణంలోని 2, 5, 11వ వార్డులలో ప్రధాన డ్రైనేజీ కాల్వలు నిర్మాణ పనులకు బుధవారం చైర్మన్ గఫార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సహకారంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కల్వర్ట్, డ్రైనేజీలు, సిమెంటు రోడ్లు పనులను చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి ఇంటికి కుళాయి నిర్మాణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుతో మంచి నీటి సమస్యలు తీరనున్నాయన్నారు. నిర్మాణ పనులను పొందిన కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పీ కృష్ణమోహన్‌రెడ్డి, ఏఈ కోటేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్, సద్గురు తదితరులు పాల్గొన్నారు.



వీవోఏల సమావేశంలో మాట్లాడుతున్న అంబేడ్కర్

త్వరితగతిన రుణాలను రికవరీ చేయాలి

పామూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పొదుపుగ్రూపు సభ్యులు తీసుకొన్న రుణాలను సకాలంలో రికవరీ చేయాల్సిన బాధ్యత గ్రామ సంఘాల అధ్యక్షులపై ఉందని ఏరియా కోఆర్డినేటర్ అంబేడ్కర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ అధ్యతన వీవోఏలతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు మహిళలు తీసుకొన్న శ్రీనిధి, సీసీఎల్, సీఏఎఫ్, ఉన్నతి రుణాలకు సంబంధించి రికవరీ ప్రస్తుతం పనిచేస్తున్న వీవోఏలదే బాధ్యత అన్నారు. రుణాల రికవరీకి సంబంధించి త్వరలో టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించి రుణాలు వసూలు చేయనున్నారని, వీవోఏలు క్షేత్ర స్థాయిలో రుణాల రికవరీ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో శ్రీనిధి మేనేజర్ సంపత్ కుమార్, డీపీఎం షేక్ జిలాని, ఇన్‌చార్జి ఏపీఎం ఎం.అశోక్, మండల సమాఖ్య కార్యదర్శి ఉమ్మడి పద్మావతి, సీసీలు సరళ, శ్రీను, సుబ్రమణ్యం, అకౌండెంట్ భారతి, వీవోఏలు పాల్గొన్నారు.



కోటయ్య దంపతులను సన్మానిస్తున్న ఎన్ఎస్‌పీ డీఈ పూర్ణచందు, మాజీ ఎంపీపీ వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కృషి

- ఎన్ఎస్‌పీ డీఈ పూర్ణచందు

ముండ్లమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేసిన ఉద్యోగి నంబూరి కోటయ్య అని ముండ్లమూరు ఎన్ఎస్‌పీ డీఈ బీ పూర్ణచంద్ర అన్నారు. మోదేపల్లి మేజరు కాలువ పరిధిలో లస్కర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కోటయ్యను బుధవారం ఎన్ఎస్‌పీ కార్యాలయ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈ పూర్ణచంద్ర, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. అనంతరం ఆయన దుశ్శాలువాలతో, గజమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూరపాటి నారాయణ స్వామి, మాజీ ఎంపీటీసీ జంపాని శ్రీనివాసరావు, జేఈలు క్రాంతి కుమార్, ప్రసాదు, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, నీటి సంఘాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు రగ్గుల పంపిణీ

పామూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి డాక్టర్ కవిత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు మెంటా నరసింహారావు 276 బూత్ పరిధిలోని ఎస్టీకాలనీలో పలువురికి రగ్గులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, వైద్యశాల డైరెక్టర్ ఎన్. సాంబయ్య, షేక్ గౌసబాష, జనసేన జిల్లా కార్యదర్శి వై. రహీముల్లా, సందానిబాష తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రహదారులు - దెబ్బతిన్న నేల చప్టాలు

పట్టించుకోని అధికారులు

ప్రజలకు తప్పని ఇబ్బందులు

ముండ్లమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో పలు ప్రధాన గ్రామాలకు వెళ్లే రహదారులు, నేల చప్టాలు ధ్వంసమయ్యాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు ఆ వైపు కూడా కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో వాహన చోదకులు, అయా గ్రామాల ప్రజలు అయా రహదారులపై ప్రయాణం చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముండ్లమూరు నుంచి వేంపాడు మధ్య చిలకలేరు వాగుపై దశాబ్దాల క్రితం నిర్మించిన నేల చప్టా తుఫాన్ ధాటికి కొట్టుకు పోయింది. అలాగే ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్లే ప్రధాన రహదారిపై చిలకలేరు మీద నిర్మించిన బ్రిడ్జి సైతం దెబ్బతింది. పసుపుగల్లు నుంచి తమ్మలూరు వెళ్లే ప్రధాన రహదారి వాగుపై నిర్మించిన నేల చప్టా పూర్తిగా దెబ్బతింది. కనీసం పశు పోషకులు కూడా వెళ్లలేని పరిస్థితి. దీంతో రెండు గ్రామాల ప్రజలు, పశు పోషకులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పసుపుగల్లు నుంచి నడింపల్లివారి కండ్రిక వెళ్లే ప్రధాన రహదారిపై చిలకలేరు వాగుపై ఇటీవల నిర్మించిన నేల చప్టా ధ్వంసమే కాక పలుచోట్ల ఆ రహదారి కోసుకుపోయింది. భీమవరం నుంచి మక్కెనవారిపాలెం వెళ్లే ప్రధాన రహదారి, నందమూరి నగర్ నుంచి ముప్పరాజువారిపాలెం వెళ్లే పంచాయతీ రహదారి, వేములబండ నుంచి పసుపుగల్లు వచ్చే ప్రధాన రహదారి చిలకలేరు వాగులపై ఉన్న రెండు బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమామహేశ్వర అగ్రహారం నుంచి చింతలపూడి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా పలు చోట్ల దెబ్బతింది. పూరిమెట్ల నుంచి మక్కెనవారిపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి కిలో మీటరు పైన కోసుకుపోయింది. దీంతో వాహన చోదకులు అతి కష్టం మీద ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో ప్రధాన వాగులపై ఉన్న బ్రిడ్జీలు, నేల చప్టాలు, పంచాయతీ రహదారులు దెబ్బతిని ప్రయాణం అస్తవ్యస్తంగా తయారైంది. రాత్రుల సమయాల్లోనైతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వాహన చోదకులతో పాటు మండల ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



పసుపుగల్లు నుంచి నడింపల్లి వారి కండ్రికకు వెళ్లే రహదారిలో చిలకలేరు వాగుపై దెబ్బతిన్న చప్టా



మొంథా తుఫాన్ ధాటికి దెబ్బతిన్న తమ్మలూరు - పసుపుగల్లు మధ్య చిలకలేరు వాగుపై చప్టా

రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయండి

- కలెక్టర్‌ను కలిసి కోరిన టీడీపీ దర్శి ఇన్‌చార్జి లక్ష్మి

దర్శి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బీభత్సం వలన దెబ్బతిన్న రోడ్లు, కాలువల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కలెక్టర్ రాజాబాబుకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం డాక్టర్ లలిత్‌సాగర్, స్థానిక టీడీపీ నాయకులతో వెళ్లి ఆమె కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఎస్‌పీ శాఖలకు సంబంధించిన రోడ్లు, కాలువలు. తాగునీటి పథకాలు తుఫాన్ బీభత్సం వలన ధ్వంసం అయ్యాయని వివరించారు. అత్యవసర మరమ్మతులకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. పంటల నష్టం, ఆస్తి నష్టంపై ఆమె నివేదికను అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన రాజాబాబు నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. అత్యవసర పనుల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు మండల టీడీపీ నాయకులు ఓబుల్‌రెడ్డి, రమేష్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రాజాబాబుతో చర్చిస్తున్న టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

ఘనంగా కార్తీకపౌర్ణమి వేడుకలు

- కిటకిటలాడిన శివాలయాలు
- మహిళల దీపారాధనలు
- వైభవంగా జ్వాలాతోరణం

కనిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమి వేడుకలు భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కనిగిరి ప్రాంతంలోని దేవాలయాలన్నీ దీపారాధన జ్యోతులతో ఆధ్యాతికతను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని కొండ పైన వెలసిన విజయమార్తేండేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పిండి దీపాలు, ప్రమిదలలో దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా కొండ దిగువ శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని 108 శివలింగాలకు పూజలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని రామాలయం వీధిలోని పాతశివాలయం కార్తీక శోభతో వెలిగిపోయింది. పట్టణ సమీపంలోని చాకిరాల శివాలయంలో భక్తులు అశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా దేవాలయంలోని శ్రీభవానీశంకర స్వామికి అత్యంత ఘనంగా పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా బాబా మందిరంలో అత్యంత వైభవంగా జ్వాలాతోరణం నిర్వహించారు.

శ్రీజగదాంబ దొంతులమ్మ ఆలయంలో..

పట్టణంలోని శ్రీజగదాంబ దొంతులమ్మ ఆలయంలో బుధవారం కార్తీకపౌర్ణమి వేడుకలు ఆలయ కమిటీ నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో మహిళలు అ.ది.క సంఖ్యలో పాల్గొని జోతులతో అత్యంత భక్తిశ్రద్ధలతో జ్వాలాతోరణం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు.



విజయమార్తాండేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధనలు చేస్తున్న మహిళాభక్తులు



బాబా ఆలయంలో భక్తులకు కనువిందు చేస్తున్న జ్వాలాతోరణం

కురిచేడులో..

కురిచేడు : కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు స్థానిక జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర స్వామి వారి ఆలయానికి పోటెత్తారు. మహిళా భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. కురిచేడులో ప్రాచీనమైన శివాలయానికి బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామునుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం మహిళలు ఆలయ ఆవరణ, ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది.



కురిచేడు శివాలయంలో ప్రత్యేక అలంకరణలో శివుడు



దర్శిశివాలయం వద్ద బారులు తీరిన మహిళలు

దర్శిలో..

దర్శి : మండలంలో కార్తీకపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. స్థానిక శ్రీ అన్నపూర్ణదేవి సమేతా కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుఝాము నుంచి భక్తులు పోటెత్తారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో భారీఎత్తున కార్తీకదీపాలు వెలిగించి పూజలు చేశారు. మండలంలోని కొర్లమడుగు, పోతవరం, పొతకమూరు శివాలయాల్లో కార్తీకపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.

దొనకొండలో..

దొనకొండ : కార్తీకపౌర్ణమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణలతో మార్మోగాయి. స్థానిక ఆనంద ఆశ్రమంలోని శివాలయంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పర్యవేక్షణలో ఉదయం నుంచి శ్రీ కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు కార్తీకదీపాలు వెలిగించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం జ్వాలాతోరణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.



దొనకొండ ఆనంద ఆశ్రమంలో ప్రత్యేక అలంకరణలో పరమశివుడు

భక్తులతో నిండిన భైరవకోన

- జలపాతం వద్ద పవిత్ర స్నానాలు ఆచరించిన పర్యాటకులు

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా సీఎస్‌పురం, పామూరు మండలాల్లోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోనలోని శ్రీ త్రిముఖ దుర్గాంబ అమ్మవారి క్షేత్రంలో పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా దుర్గాదేవి అమ్మవారిని అశేష భక్తులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు జలపాతం వద్ద అందాలను తిలకిస్తూ కొలనుల్లో పవిత్ర స్నానాలు ఆచరించి మొక్కులను చెల్లించుకొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా కనిగిరి డీఎస్పీ పి. సాయిఈశ్వర్ యశ్వంత్, పామూరు సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం. వెంకటేశ్వర నాయక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పామూరులోని శ్రీ పార్వతి సమేత వల్లీ భుజంగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సాయంత్రం ప్రమిదల్లో కార్తీక దీపాలు వెలిగించి నీటి కొలనులో వదిలిపెట్టారు. కాగా మండలంలోని పడమటకట్టకింద పల్లిలోని శ్రీ కామాక్షీ సమేత దుర్గామల్లేశ్వరుడు, దాదిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ పార్వతి సమేత నీలకంఠేశ్వరుడు, మోపాడులోని శ్రీ గొందిమల్లేశ్వరుడు, బొట్లగూడూరులోని పార్వతీసమేత రామలింగేశ్వరుడు, విరాట్‌నగర్‌లోని శ్రీ కామాక్షీసమేత అమరేశ్వర స్వామి దేవస్థానాల్లో సహస్ర దీపాలంకరణ మహోత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన ఈవోలు నరసింహబాబు, వి. వంశీకృష్ణారెడ్డి, చైర్మన్ శ్యామ్ సుందరరాజు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.



భైరవకోన జలపాతం వద్ద స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

శంభో శివ శంభో..

ముండ్లమూరు : మండలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పలు శివాలయాలు బుధవారం భక్తులతో పోటెత్తాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు శివాలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు శివ నామ స్మరణతో మారుమోగి పోయాయి. మండలంలోని పసుపుగల్లులో కాశీ విశ్వేశ్వర స్వామి, అన్నపూర్ణాదేవి ఆలయం, ముండ్లమూరులోని మల్లమాంబ మల్లిఖార్జున స్వామి దేవాలయం, పులిపాడులోని శ్రీ గంగా పార్వతి సమేత పూర్ణేశ్వర స్వామి, మారెళ్ళలోని చెన్నమల్లేశ్వర స్వామి, ఈదరలోని శ్రీ రాజ రాజేశ్వరి దేవి, పోలవరంలో శివాలయం, ఉమా మహేశ్వర అగ్రహారంలో శివాలయం, భీమవరంలోని శివాలయాలు భక్తులతో కిట కిటలాడాయి. ఆలయంలో ఉన్న దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు.



పసుపుగల్లులో ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వర స్వామి

పీసీపల్లిలో..

పీసీపల్లి : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలో ఉన్న శైవక్షేత్రాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు.పెదయిర్లపాడు మల్లేశ్వర స్వామి ఆలయం, వెంగళాపురం సమీపంలోని పంచాలింగాలకొండ, విఠలాపురంలో ఉన్న శివాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దర్శి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా, ఆ తర్వాత వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వలన సాగు చేసిన పలు పైర్లకు తెగుళ్ల సోకకుండా తక్షణ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని దర్శి వ్యవసాయాధికారి కె. రాధ సూచించారు. దర్శి పరిధిలో సాగు చేసిన పంటలను పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె పరిశీలించారు. కంది పంట పూతదశలో ఉన్నందున పురుగులు, తెగుళ్ల సోకకుండా ప్లోరీపైరిపాస్, వేపనూనె పిచకారీ చేయాలని సూచించారు. అదేవిధంగా వరి పంటకు తెగుళ్ల ఆశించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



దర్శిలో కంది పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కె రాధ తదితరులు

తక్కువ ఖర్చుతో ఆదాయం వచ్చే మార్గాలను ఎంచుకోవాలి

ముండ్లమూరు : మండలంలో పంటలు సాగు చేసే రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే మార్గాలను ఎంచు కోవాలని దర్శి డివిజన్ ఏడీఏ బాలాజీ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పసుపుగల్లు, కెల్లంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం పసుపుగల్లు రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రైతులందరూ వేసిన ప్రతి పంటను ఈ పంట ద్వారా నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు, వీఏఏలు విజయ నిర్మల, సువర్చల, రైతులు పాల్గొన్నారు.

పదవులు పొందిన వారు బాధ్యతగా పనిచేయాలి

దొనకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో మండల, గ్రామ స్థాయిలో పదవులు పొందిన వారు గ్రామాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. మండల టీడీపీ బీసీ సెల్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన చొప్పరపు మైకేల్‌బాబు, పోతిపోగు చెన్నయ్య మరికొందరు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులకు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, దర్శి ఏఎంసీ డైరెక్టర్ శృంగారపు నాగసుబ్బారెడ్డి, బండ్లా వెంకటనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే టీఎన్‌యూఎస్ లక్ష్యం

దొనకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యలు, ప్రయోజనాలను కాపాడటానికి, వారి వృత్తిపరమైన గౌరవాన్ని పెంచడానికి తెలుగునాడు ఉపాధ్యాయుల సంఘం బాధ్యతగా కృషి చేస్తుందని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలుగునాడు ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు కార్యక్రమంను బుధవారం మండలంలో నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల కోసం టీఎన్‌యూఎస్ చేస్తున్న కృషిని వివరించి సభ్యత్వ నమోదును చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రెహమాన్, శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు బాలగురువులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఉపాధ్యాయులకు యాప్‌లో సెలవు సౌకర్యం కల్పించాలి

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులకు ప్రస్తుతం సెలవు సౌకర్యం లీప్ యాప్‌లో అందుబాటులో లేకపోవడం వలన వారు సెలవులు దరఖాస్తు చేసుకొనే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు టి. శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌లు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రయివేట్ వాహనాలకు రూ.73 వేల జరిమానా

పామూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సరైన పత్రాలు లేకుండా అక్రమంగా తిరుగుతున్న పలు వాహనాలను దర్శి మోటారు వాహనాల తనిఖీ అధికారి పి. రవికుమార్ బుధవారం తనిఖీ చేసి వాటికి రూ.73 వేల జరిమానా విధించారు. పట్టణంలో ఓ ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులో అత్యవసర ద్వారం వద్ద ఉన్న బెర్త్‌ను తొలగించినందున రూ.23 వేలు, పత్రాలు సక్రమంగా లేని పలు వాహనాలకు రూ.55 వేలు, మొత్తం రూ.73 వేల జరిమానా విధించినట్లు రవికుమార్ తెలిపారు.ఈ నెలాఖరు నాటికి అన్ని ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు నిర్వహకులు పత్రాలను సరిచేసుకోవాలని హెచ్చరించారు.



ప్రయివేట్ వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీవో రవికుమార్

దళితులను దూషించిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు,నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : వివాహ కార్యక్రమానికి డీజే పెట్టామన్న కారణం చూపుతూ అకారణంగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కూల దూషణ చేసిన తాళ్లూరు ఎస్సై ఎస్ మల్లిఖార్జునరావుపై తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని తాళ్లూరు దళిత కాలనీ పెద్ద, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ అనపర్తి సత్యవర్ధన్‌రావు ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు బుధవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్పీని కలసిన వారిలో మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సృజన మాదిగ్, ఎమ్మార్పీఎస్ నేతలు ఆనపర్తి ఆదాం మాదిగ్, అనపర్తి సుబ్బారావు, అనపర్తి విజయ్‌కుమార్, గర్నెపూడి యోహాన్, సత్యవర్ధన్‌రావు తదితరులు ఉన్నారు.

కార్మికులకు పనిభారం తగ్గించాలి

కురిచేడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్మికులకు పనిభారం తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 8,9 తేదీలతో దర్శిలో సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కురిచేడులో బుధవారం కార్మికులతో ర్యాలీ నిర్వహించారు.



సూర్యలంక సముద్రతీరంలో గజఈతగాళ్లతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

తుఫాన్‌తో తీరంలో గోతులు

యథాస్థితికి మరో రెండు రోజులు

బీచ్‌లో పరిస్థితులపై కలెక్టర్ పరిశీలన

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సూర్యలంక సముద్రతీరంలో లోతైన గుంతలు ఏర్పడినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బీచ్ సందర్శన, ప్రస్తుత పరిస్థితులపై బుధవారం కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులు, గజ ఈతగాళ్లతో మాట్లాడారు. రెండు రోజుల్లో బీచ్‌లో ఏర్పడిన గుంతలు పూడిపోయి యథాస్థితికి వస్తుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గోతుల కారణంగా పర్యాటకులను, కార్తిక భక్తులను బీచ్ సందర్శన నిషేధించినట్లు తెలిపారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

దేశంలోనే సూర్యలంక బీచ్ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బీచ్‌ను సర్వాంగ సుందరంగా ఉంచాలన్నారు. పర్యాటక మిత్ర సిబ్బందితో బీచ్‌లో గస్తీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి ప్రత్యేకంగా యూనిఫామ్, వాకీటాకీలు ఇవ్వాలన్నారు. బీచ్‌లో ఉన్న సీసీ కెమెరాలను, లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. తుఫాన్ షెల్టర్‌ను పునరుద్ధరించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట డీపీవో ప్రభాకర్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఎస్పీ జి.రామాంజనేయులు, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు ఉన్నారు.

ఉద్యోగాల పేరుతో రూ.కోట్లు స్వాహా

అమృతలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ ద్వారా కంప్యూటర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నియోజకవర్గానికి చెందిన ఓ వ్యక్తి నిరుద్యోగుల నుంచి రూ.కోట్లు స్వాహా చేశాడన్న ఆరోపణలున్నాయి. నియోజకవర్గం లోని ఓ గ్రామానికి చెందిన అతడు గతంలో ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కార్యాలయం కూడా ఏర్పాటు చేసి కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు అంటూ నిరుద్యోగులకు గాలం వేశాడు. ఓ మంత్రిత్వశాఖలో ఉన్నతాధికారి సహకారం ఉందని అతడు బహిరంగంగానే చెప్తున్నట్లు పలువురు తెలిపారు. ఒక్కొక్కరి నుంచి రూ.60 వేల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. భట్టిప్రోలు మండలానికి చెందిన వారు ఎక్కువగా ఇతడి గాలానికి చిక్కినట్లు తెలిసింది.

సర్వపాప హరణం జ్వాలా తోరణం


వైభవంగా కార్తిక పౌర్ణమి పూజలు

శివ నామస్మరణతో మారుమోగిన ఆలయాలు





ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరుడు, అమరేశ్వరుడు



కోటప్పకొండ దేవస్థానంలో జ్వాలా తోరణం

రేపల్లె, అద్దంకి, కోటప్పకొండ, అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తిక మాసం పౌర్ణమికి ఆలయాలు బుధవారం భక్తులతో పోటెత్తాయి. శివనామస్మరణతో మారుమోగాయి. పుణ్యస్నానాలు, ప్రత్యేక పూజలు, దీపారాధనలతో ఆధ్యా త్మికం వెల్లివిరిసింది. దేవస్థానాలు దీపతోరణాలతో వెలుగులు విరజి మ్మాయి. నిండు పౌర్ణమి కాంతులు భువి నుంచి ఆకాశంలో పరిచినట్లు.. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాల ను ఆలయాల ప్రాంగణాల్లో వెలిగించి.. ప్ర త్యేక పూజలు నిర్వహించారు. ప్రము ఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. విశేష అభిషేకాలు నిర్వహించి కోటయ్య స్వామికి ప్రత్యేక అలంకారం చేశారు. రాత్రి నేత్ర పర్వంగా జ్వాలా తోరణం జరిగింది. స్వామికి అఖండ పూజ చేశారు. గిరి ప్రదక్షిణ కోలాహలంగా సాగింది. ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపారాధనలు చేశారు.

ముక్తేశ్వరస్వామి ఆలయంలో..

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని రేపల్లెలోని పెనుమూడి, మోర్తోట వద్ద కృష్ణా నదిలో భక్తులు పుణ్యస్నానాలచరించారు. కార్తిక దీపారాధనలు చేసి.. గౌరమ్మకు పసుపు, కుంకుమ పూజలు చేశారు. ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి, అరవపల్లిలోని బాలకోటేశ్వరస్వామి, మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్వామివార్లకు ఏకాదశ మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

పులకించిన అమరేశ్వరాలయం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలోని బాల చాముండికా సమేత అమరేశ్వరాలయానికి వేలాది మంది భక్తులు కార్తిక పౌర్ణమి పూజలకు తరలి వచ్చారు. ఉదయం కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నదీతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించారు. తొలి అభిషేక కార్యక్రమంలో దేవస్థాన వంశ పారం పర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణ ప్ర సాద్ దంపతులు పాల్గొని, పూజలు నిర్వహించారు.



మోర్తోట ముక్తేశ్వరస్వామిదేవాలయంలో పౌర్ణమిపూజల్లో పాల్గొన్న భక్తులు



అద్దంకిలోని పాత శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



అమరావతి: క్యూలో భక్తులు

గుంటూరు సంపత్‌నగర్ శారదా పీఠంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అమరావతి: కృష్ణానదిలో దీపాలు వదులుతున్న దంపతులు

రెండు కార్లు ఢీ.. ఇద్దరు మృతి

మరో ముగ్గురికి గాయాలు

చిలకలూరిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - చీరాల హైవేపై చిలకలూరిపేట మండలం పసుమర్రు వద్ద బుధవారం రెండు కార్లు ఢీకుని ఇద్దరు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడినట్లు చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. వింజనంపాడులో అంత్యక్రియల కార్యక్రమానికి హాజరై వస్తున్న ఓ కారు, చీరాల నుంచి వచ్చిన కారును ఢీకొట్టింది. దీంతో వింజనంపాడు నుంచి వస్తున్న కారులోని ఐదుగురిలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మిగిలిన వారు గాయపడ్డారు. మృతి చెందిన వారిని బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి విజయలక్ష్మి(56), పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలేనికి చెందిన కనపర్తి వరలక్ష్మి(70)గా గుర్తించారు. కాగా అదే కారులో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ సాదినేని సుధీర్‌బాబు వింజనంపాడువాసిగా గుర్తించారు. ఉప్పుగొండూరుకు చెందిన నూతలపాటి సుబ్బారావు, కోనంకికి చెందిన వజ్జా సాహిత్య స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారు చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి.



ప్రమాదానికి గురైన కారు

రెవెన్యూ డివిజన్‌గా.. అద్దంకి

110న మంత్రి మండలి సమావేశంలో ఆమోదం?

అద్దంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అద్దంకి వాసుల రెవెన్యూ డివిజన్ కల సాకారం కానున్నది. జిల్లాల పునర్విభజన, కొత్త రెవెన్యూ డివిజన్లపై చర్చించేందుకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటైన ఉపసంఘం బుధవారం సమావేశమైంది. ఈ సమావేశంలో కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు ప్రతిపాదించగా అందులో అద్దంకి కూడా ఉంది. ఈ క్రమంలో ఈ నెల 10వ తేది జరిగే మంత్రి మండలి సమావేశం లో కొత్త రెవెన్యూ డివిజన్లపై తీర్మానం చేసే అవకాశం ఉంది.



కనుల పండువుగా శాంతి కల్యాణం

మార్టూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని జొన్నతాళి గ్రామం భక్తజనంతో ఆధ్యాత్మిక వాతావరం సంతరించుకుంది. గ్రామంలోని గంగమ్మ తల్లి దేవస్థానంలో శ్రీగంగా పార్వతీ సమేత మహా కాళేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శర్మ ఆధ్వర్యంలో జరిగిన స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ప్రజలు కనుల పండువుగా తిలకించారు. గ్రామంలో తొలిసారిగా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో గంగా పార్వతీ సమేత శ్రీమహా కాళేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి దీపారాధన చేశారు. తదుపరి భక్తులకు కమిటీ సభ్యులు అన్నసంతర్పణ చేశారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

శింగరకొండకు భారీగా తరలివచ్చిన భక్తులు

అద్దంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ గిరి ప్రదక్షిణ బుధవారం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభమైన గిరి ప్రదక్షిణ అభయాంజనేయస్వామి విగ్రహం, గోపాలపురం, భవనాసి చెరువు మీదగా సాగింది. ప్రదక్షిణ అనంతరం లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద దామోదరస్వామి పూజ నిర్వహించారు. ఈవో మద్దినేని శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, కరి రమాసుందరి, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శింగరకొండలో పూజలు నిర్వహిస్తున్న ఈవో మద్దినేని శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్లు గుంజి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకరరావు



గిరి ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

లెక్కల్లో.. వ్యత్యాసాలు

రైతులకు ప్రతిబంధకంగా మారిన నిబంధనలు

సీఎం యాప్‌లో నమోదు కాని 30 వేల ఎకరాలు

పంట నష్టం నమోదుకు రెండు రోజులు గడువు పెంపు

పొంతనలేని అంచనాలు.. గణాంకాలు

(బాపట్ల, చీరాల, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ రైతులను నిండా ముంచేయగా.. పరిహారంపై అనుమానాలు నెలకొం టున్నాయి. తుఫాన్ తీరం దాటిన మరుస టి రోజే పంట నష్టంపై వ్యవసాయశాఖ ప్రాథమిక నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం ఉద్యాన పంటలతో కలుపుకుని జిల్లాలో 84,500 ఎకరాలు ముంపు బారిన పడినట్లు తేల్చింది. అప్పటికే జిల్లావ్యాప్తంగా దాదాపు 80 శాతం పొలాలు ముంపులోనే ఉన్నాయి. ఆ తర్వాత వాగులకు గండ్లు పడడంతో పొలాలను వరద నీరు ముంచెత్తిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలు పెరుగుతాయని అందరూ భావించారు. అయితే ప్రస్తుతం గురువారం వరకు నష్టం తుది అంచనాలను చూస్తే ప్రాథమిక నివేదికలతో పోల్చుకుంటే తక్కువగా ఉండే అవకాశాలు కనబడుతున్నాయి. ఏపీ ఎయిమ్స్ యాప్‌లో నష్టం వివరాల నమోదు ఆధారంగానే పం ట విస్తీర్ణం లెక్క తేల్చాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే దీనినే ప్రామాణి కంగా తీసుకుంటే అర్హు లైన ఎంతో మంది రైతుల కు అన్యాయం జరిగే అవ కాశం ఉందని ఆంధ్ర జ్యోతి ముందే హెచ్చరించింది. తుఫాన్ ఆసాంతం ముంచేసిందని ఉదా రంగా ఆదుకోవాలని రైతుల అభ్యర్థిస్తున్నారు. అయినా ఏపీ ఎయిమ్స్ యాప్‌లో నిక్షిప్తం చేసిన నష్టం వివరాలనే ప్రామాణికంగా తీసుకోనున్నట్లు సమాచారం. నష్టం వివరాలను ఎయిమ్స్ యాప్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియ వారం రోజులుగా ముమ్మరంగా సాగింది. బుధవారం నాటికి దాదాపు 42,000 ఎకరాలకు సంబంధించి నష్టం వివరాలు యాప్‌లో నమోదైనట్లు యంత్రాంగం చెబుతోంది. ప్రభుత్వం ఇచ్చిన గడువు గురువారంతో ముగియగా మంత్రి అచ్చెన్నాయుడు మరో రెండు రోజులు పెంచారు. అయినా తుది లెక్కలు 55,000 ఎకరాల వద్దే ఆగిపోనున్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక లెక్కల ప్రకారం 84,500 ఎకరాల్లో పంట ముంపు బారిన పడినట్లు తేలిన సంగతి తెలిసిందే. అంటే దాదాపు 30,000 ఎకరాల వ్యత్యాసం కనబడుతోంది.



ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది(పాతచిత్రం)

మాన్యువల్ నమోదుపై లేని స్పష్టత

ప్రాథమిక నివేదికలకు, తుది జాబితాకు పొంతన లేకపోవడా నికి సాంకేతిక అంశాలు కారణ మని తెలుస్తోం ది. నిబంధనల ప్రకారం ఎయి మ్స్ యాప్‌లో నష్టం వివరాలు నమోదు కావాలంటే, సదరు పంట విస్తీర్ణం ఈ-క్రాప్‌లో రికార్డై ఉండాలి. అది కూడా పంట వివరాలు కూడా మ్యాచ్ అవ్వాలి. ఈ నిబంధనలు రైతులకు ప్రతిబంధకంగా మారనున్నాయని వ్యవసాయశాఖ సైతం తే ల్చింది.అయితే మాన్యువల్ నమోదుపై తమకు ఎలాంటి ఆదేశాలు లేవనేది యంత్రాంగం మా ట. సీసీఆర్‌సీ కార్డులు, ఇప్పటికే భూయజమాని పేరు ఎయిమ్స్ యాప్‌లో నిక్షిప్తం అయి ఉండడం వంటి సాంకేతిక అంశాలన్నీ కూడా నిజంగా పంట నష్టపోయిన కౌలు రైతులకు గుదిబండగా మారి పరిహారానికి దూరమయ్యే అవకాశాలున్నాయి.

తీవ్ర సంక్షోభంలో రైతులు..

మొంథా తుఫాన్‌కు సరిగ్గా పదిరోజులకు ముందే దాదాపు 6,800 ఎకరాల పంట ముంపు బారిన పడినట్లు వ్యవసాయశాఖ తేల్చింది. ఆ తర్వాత తుఫాన్ మొత్తాన్ని ఊడ్చేసింది. రోజుల తరబడి పంట నీళ్లల్లో ఉండడంతో కుళ్లిపోయి పనికి రాని స్థితికి చేరుకుంది. జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 2,85,000 ఎకరాలుగా ఉంది. ఇందులో 75 శాతం వాటా వరిదే కాగా, మొన్నటి ముంథా తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయింది కూడా వరి రైతే. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం అంచనాల ప్రకారం ప్రిలిమనరీ నివేదికలనే రైతులు తప్పుబట్టారు. అలాంటిది ఇప్పుడే తుది జాబితా ప్రాథమిక నష్టం గణాంకాలకు ఆమడ దూరంలో ఉండడం మొత్తం ప్రక్రియపైనే అనుమానాలు రేకెత్తించే విధంగా ఉన్నాయి.

ఆదమరిస్తే.. ప్రమాదం

1 ద్విచక్ర వాహనచోదకులు తస్మాత్ జాగ్రత్త

1అద్దంకి -రేణింగవరం రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదాలు

అద్దంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు బాగుంది.. ఎదురేలేదు.. రయ్‌రయ్ అంటూ దూసుకెళ్తున్నారా.. జాగ్రత్త. ఏమాత్రం ఆదమరిచారా.. ఆ గోతుల బైక్ చక్రం పడిందంటే ప్రమాదానికి గురైనట్లే. అద్దంకి-రేణింగవరం మార్గంలో రోడ్డుపై పొడవుగా మూర లోతున ఏర్పడిన గోతిని పూడ్చకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అద్దంకి-రేణింగవరం రోడ్డులో గరటయ్య కాలనీకి సమీపంలో నల్లవాగు వద్ద కల్వర్టు అంచులు కోతకు గురయ్యాయి. నల్లవాగుకు దగ్గరలోనే మలుపు వద్ద రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడింది. జార్లపాలెం-కశ్యాపురం మధ్య వాగులో నేల చప్టా మధ్యలో పగుళ్లు వచ్చి గోతులు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పగుళ్ళు పెద్దవి కావడంతో ద్వి చక్ర వాహనాలు రాత్రి సమయంలో పగుళ్లలో ఇరుక్కుని ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ మోటార్‌సైకిలిస్టు ప్రమాదానికి గురయ్యాడు. చిన్నపాటి మరమ్మతులతో ప్రమాదాలను నివారించే అవకాశం ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ద్విచక్ర వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అద్దంకి-రేణింగవరం రోడ్డులో జార్లపాలెం, కశ్యాపురం మధ్య చప్టాపై గొయ్యి

పోలీసుల అదుపులో కేటుగాడు

ఒంగోలు క్రైం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పిస్తానంటూ ఒంటరి గా నివాసం ఉండే వృద్ధురాళ్లను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడే కేటుగాడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఒంగోలు నగరంలోని కమ్మపాలెం, ఇందిరకాలనీలో ఇరువురు వృద్ధురాళ్లను మోసం చేసి వారి వద్ద నుంచి రూ.50 వేల నగదు అపహరిచాడు. ఆర్నెళ్ల క్రితం ప్రభుత్వం కుట్టుమిషన్లు ఇస్తుందంటూ మాయమాటలు చెప్పి ప్లేటులో చీర, నగదు పెట్టి ఫొటో తీయాంటూ వృద్ధురాళ్ల దృష్టి మరల్చి నగదు అపహరించుకెళ్లాడు. చీరాలలో ఇదే తరహా కేసు నమోదైంది. దీంతో బాపట్ల, ప్రకాశం జిల్లాల పోలీసులు నిఘా ఉంచారు. ప్రకాశం జిల్లా సీసీఎస్ పోలీసులు కేటుగాడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బాపట్ల, ప్రకాశం, గుంటూరు జిల్లాలో సుమారుగా 30 మందిని ఈ కేటుగాడు మోసాలు చేసి నగదు దోచుకెళ్లాడు.

10నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

ఒంగోలు విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 10నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. 6,7 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 నుంచి 4.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 1నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 11నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి.

రైతులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం తక్షణమే ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక మాదాల నారాయణస్వామిభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల జిల్లాలో భారీ నష్టం జరిగిందన్నారు. రాష్ట్రలో 16లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. రైతులకు ఎకరాకు రూ.25నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. కార్యక్రమంలో బి.పద్మ, రాజశేఖర్, జాలన్న, తిరుమల రావు, వి.రామ్మోహన్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో స్టెతస్కోప్‌ల అందజేత

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి స్టెతస్కోప్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అందజేశారు. టెక్సాస్‌లో పనిచేస్తున్న అత్తిపట్ల అశోక్ కుమార్‌చౌదరి సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న 12మంది మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం వీటిని అందజేశారు. ఈ స్టెతస్కోప్‌లను విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్యసేవలకు ఉపయోగించుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుందర్, డాక్టర్ ఎం.సువర్ణరాజు, జిల్లా ఆరోగ్య విస్తరణ, మీడియా అధికారి బెల్లం నరసింహారావు, 104 సర్వీసెస్ జిల్లా మేనేజర్ జిలానీ పాల్గొన్నారు.

పుస్తకాల ర్యాక్‌ల అందజేత

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు ఐదు పుస్తకాల ర్యాక్‌లను బహూకరించారు. దాత గట్టిబోయిన నరసింహారావు అందించిన వాటిని ఒంగోలులోని జీఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద స్వీకరించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ తంగెళ్ళ, ఆలూరు జడ్పీ హైస్కూలు, ఒంగోలు బాలాజీ నగర్‌లోని మునిసిపల్ హైస్కూలు, చేవూరు జడ్పీ హై స్కూలుకు వాటిని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రావిపాటి శ్రీనివాస రావు, కార్యదర్శి కొల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీరామమూర్తి, రీజనల్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్యాలయం ప్రారంభం

● హాజరైన ఎంపీపీ అంజమ్మ

నాగులుప్పలపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులో ఉపాధి హామీ పథకం కార్యాలయ భవనాన్ని ఎంపీపీ నలమలపు అంజమ్మ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేసు, ప్రత్యేకాధికారి జి.జోసఫ్‌కుమార్, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, ఏవో మూర్తి, కృష్ణారెడ్డి, మారెళ్ల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

మార్కాపురం జీజీహెచ్ నుంచి వైద్య సామగ్రి తరలింపు

పీపీపీ మోడ్‌లోకి వెళ్లడంతో డీఎంఈ ఆదేశం

మెరుగైన వైద్య సేవలు కష్టమే



మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల

మార్కాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్) నుంచి వైద్య సామగ్రిని తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ జి.రఘునందన్ గత నెలలోనే ఆదేశాలు జారీ చేశారు. ఏ పరికరాలు ఏ వైద్య కళాశాలకు తరలించాలో ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కాపురానికి వైద్య కళాశాల మంజూరు కావడంతో జిల్లా వైద్యశాలను అప్‌గ్రేడ్ చేసి జీజీహెచ్‌గా మార్పు చేశారు. అప్పట్లో వైద్య కళాశాల స్థాయికి అనుగుణంగా వైద్యులను, సామగ్రిని ఏర్పాటు చేశారు. 150 బెడ్లతో ఉన్న వైద్యశాలను 350 బెడ్లకు పెంచారు. కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగాయి. అంతేకాక నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి తరగతులు నిర్వహించేందుకు సకాలంలో అనుమతులు తేలేకపోయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు మెడికల్ కాలేజీల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని ఎలాగైనా పూర్తి చేయాలని పీపీపీ విధానంలోకి మార్చారు. ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారు. త్వరలో టెండర్ దక్కించుకున్న సంస్థ వైద్య కళాశాలను నిర్మించనుంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఆ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఆగకుండా మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు ఉన్నపళంగా వైద్య సామగ్రి తరలించడంతో సేవలు మృగ్యమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

సౌకర్యాలు లేకుంటే వైద్యం కష్టమే

మార్కాపురం జీజీహెచ్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నప్పుడే ఇక్కడ నుంచి కేసులను ఇతర ప్రాంతాలకు తరలించేవాళ్లు. అప్పట్లో కూడా కేవలం చిన్నపాటి వైద్యం మాత్రమే అందించేవాళ్లు. సౌకర్యాల కల్పన వలన కొన్ని శస్త్ర చికిత్సలు చేసేందుకు వీలు ఏర్పడింది. మెడికల్ కాలేజీకి కేటాయించిన వైద్యులను ఇప్పటికే పలు ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో ఉన్న కొద్దిపాటి వైద్యులతోనే నెట్టుకొస్తున్నారు. అధునాతన వైద్య సామగ్రి తరలిపోతే రోగులకు మెరుగైన వైద్య సేవలు లభించడం కష్టమే. పీపీపీ విధానం ద్వారా టెండర్ దక్కించుకున్న సంస్థ త్వరితగతిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తేనే ప్రజలకు వైద్యసేవలందించే వీలు కలుగుతుంది. అప్పటి వరకైనా మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు వైద్య సామగ్రిని ఉంచితే సరిపోయేదని డివిజన్ ప్రజలు వాపోతున్నారు.

పలు వైద్య కళాశాలలకు తరలింపు

మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉన్న మార్కాపురం సర్వజన వైద్యశాలకు గతంలో 22 రకాలైన అధునాతన వైద్య పరికాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పరిధి నుంచి మెడికల్ కాలేజీ పీపీపీ మోడ్‌లోకి వెళ్లనుండడంతో ఇక్కడ ఉన్న వైద్య సామగ్రిని రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలలకు తరలించేందుకు నిర్ణయించారు. అందులో భాగంగా 5 రకాలైన వైద్య సామగ్రిని గుంటూరు మెడికల్ కాలేజీకి మూడు రోజుల కిందట తరలించారు. అవేకాక ఇంకా 17 రకాల సామగ్రిని విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, నంద్యాల, కడప, విశాఖపట్నం, అనంతపురం, ఒంగోలు, నెల్లూరుతోపాటు మరికొన్ని వైద్య కళాశాలలకు తరలించనున్నారు. ఆయా వైద్య కళాశాలల్లో లేని సామగ్రిని ఇక్కడ నుంచి తరలించనున్నారు. మార్కాపురంతోపాటు పీపీపీ మోడ్‌లోకి తీసుకున్న ఆదోని, పులివెందుల, మదనపల్లె ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లోని సామగ్రిని కూడా ఇదే విధంగా తరలించేందుకు ఆదేశాలిచ్చారు.


జీజీహెచ్‌లో వైద్యం కోసం బారులు తీరిన రోగులు

వైద్య సామగ్రి తరలించాలని ఆదేశాలు అందాయి

రామచంద్రరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్, మార్కాపురం

ప్రస్తుతం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న 22 రకాల సామగ్రిని పలు మెడికల్ కాలేజీలకు తరలించాలని డీఎంఈ ఆదేశాలిచ్చారు. గుంటూరు మెడికల్ కాలేజీ వాళ్లు కొన్ని పరికరాలను తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు కేటాయించిన మేరకు మిగిలిన సామగ్రిని కూడా త్వరలోనే ఇతర కాలేజీల వాళ్లు తీసుకెళ్లనున్నారు. అధునాతన సామగ్రి లేకుంటే మెరుగైన వైద్యం అందించాలంటే కొంత మేర ఇబ్బందులే.

పృథులగిరి ఘాట్ రోడ్డును త్వరితగతిన నిర్మిస్తాం

● మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య


ధ్వజస్తంభానికి మొక్కుతున్న సత్య

మర్రిపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన పృథులగిరి ఘాట్ రోడ్డు నిర్మాణం పనులను వీలైనంత త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య చెప్పారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆయన లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ.. పృథులగిరి అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితోపాటు తాను కూడా కృషి చేస్తున్నానన్నారు. మంత్రి స్వామి చొరవతో నాలుగు ఘాట్ రోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్ల డీఎంఎఫ్ నిధులు మంజూరైయ్యాయని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో టెండర్ నోటిఫికేషన్ విడుదల అయ్యిందని చెప్పారు. కార్తీక మాసం ముగిసేలోపు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. నిధులు అవసరమైతే ఈ పనులు పూర్తి అయ్యేలోపు అదనపు నిధులు తీసుకొచ్చేందుకు శాయశక్తుల కృషి చేస్తామని చెప్పారు. పృథులగిరిని ఆధ్యాత్మిక క్షేత్రంతోపాటు, పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకముందు కొండపైకి చేరుకున్న సత్యకు ఆలయ కార్యనిర్వాహణ అధికారి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు ఎర్రమోతు శ్రీనివాసులు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు వేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహరావు, మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, చేరెడ్డి నరసారెడ్డి, మాకినేని శ్రీనివాసరావు, గొంటు హనుమారెడ్డి, బాలగిరి వెంకటేశ్వర్లు, కిలారి శ్రీనివాస రావు ఉన్నారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

● పటిష్ట బందోబస్తు నిర్వహించిన పోలీసులు


పూజలు అందుకుంటున్న మోక్ష రామలింగేశ్వరస్వామి


కోనేరులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న రామతీర్థం మోక్షరామలింగేశ్వరాలయానికి కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా నలువైపులనుంచి భక్తులు పోటెత్తారు. పురాణ ప్రాశస్త్యం గల ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో భక్తులు పుణ్య స్నానమాచరించి మూలవిరాట్ రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ప్రత్యేకంగా నిర్వహించిన అభిషేకాలు, విశేష పూజల్లో ప్రముఖ పార్టీల నాయకులు, గ్రానైట్ వ్యాపారులు, వీఐపీలు స్వామి వారిని దర్శించుకున్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సీఐ దాసరి ప్రసాద్, ఎస్ఐ కృష్ణయ్య, తన సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాడరేవు సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో విశేష పూజలు జరిగాయి. వివిధ కుల సంఘాల సత్రాలలో అన్నదానాన్ని నిర్వహించారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి వేడుకలును చీమకుర్తి పట్టణంలోని హరిహర క్షేత్రం, సాక్షి రామలింగేశ్వరాలయం, వీరభద్రేశ్వరాలయం, గోనుగుంట, పల్లామల్లి, నేకునంబాదు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే జ్వాలాతోరణంను కనులపండవగా నిర్వహించారు.

కళారంగ రారాజు బండారు రామారావు


మాట్లాడుతున్న శ్రీపతి ప్రకాశం

ఒంగోలు కల్చరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కళారంగంలో తిరుగులేని నటునిగా రాణించి వేలాదిమంది అభిమానులను పొందటమే కాకుండా వందలాది మంది నటులకు మార్గదర్శకులుగా నిలిచిన కళారంగ రారాజు బండారు రామారావు అని పలువురు పేర్కొన్నారు. పౌరాణిక నటులు బండారు రామారావు 49వ వర్ధంతిని బుధవారం శ్రీరామ నాట్యమండలి అధ్యక్షులు శ్రీపతి ప్రకాశం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నెల్లూరు బస్టాండు డీఆర్ఆర్ మునిసిపల్ హైస్కూల్ దగ్గర ఉన్న రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ వేమా శ్రీనివాస రావు నేతృత్వంలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో యాదల రాజశేఖర్, ఎద్దు శశికాంత్ భూషన్, బండారు ఆనంద రావు, శ్రీపతి సతీష్, కండే శ్రీనివాసరావు, ఉలిచి బాబూరావు, మిడసల మల్లిఖార్జునరావు, కనమాల రాఘవులు, కట్టా సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం ప్రదర్శించిన చింతామణి, సత్యహరిశ్చంద్ర నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

మద్దిపాడులో..

మద్దిపాడు: బండారు రామారావు సేవలు యువత కొనసాగించాలని కళాకారుడు కాకుమాను సుబ్బారావు కోరారు. మద్దిపాడు నటరాజ కళాకేంద్రంలో బండారు రామారావు వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమంలో గంగిశెట్టి నరసింహారావు, దేవరశెట్టి ఎల్లమంద, గంట కోటేశ్వరరావు, కటకం వెంకటేశ్వర్లు, నేలటూరి సత్యనారాయణ, ఆరి సూర్యనారాయణ, సుమన్, రమేష్ పాల్గొన్నారు.

చెత్తను క్లాప్‌మిత్రలకు అందించాలి

టంగుటూరు (కొండపి) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గృహ యజమానులు తడిచెత్త, పొడిచెత్తలను వేరుచేసి క్లాప్‌మిత్రలకు అందించాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం కందులూరు గ్రామంలో డీపీవో పరిశుభ్రత, నీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణను ఆయన పరిశీలించారు. ప్రతి ఇల్లూ, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేసే విధానాన్ని ఓ వీధిలో ప్రదర్శింపజేశారు.

‘ఉత్తమ’ ఉద్యోగులకు సత్కారం


ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ బుధవారం మద్దిపాడులో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతను గుర్తెరిగి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు ఉత్తమ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మందపల్లి శ్రీనివాసరావు, గోరంట్ల చిరంజీవి, పోతినేని శ్రీనివాసరావు, మార్నేని రాఘవరావు, దుగ్గినేని నరసింహారావు, దేవబత్తిన ప్రసాద్, రావిపాటి శ్రీనివాసరావు, చెన్నుపల్లి వెంకటరమణ, గట్టినేని అయ్యన్న పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో మొంథా తుఫాన్ బాధితులను ఆదుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జి.రమేష్, తంబి శ్రీనివాసులు, భావన్నారాయణ పాల్గొన్నారు.

బండ్లమూడిలో బాధితుడి పొలం పరిశీలన


పొలంలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కంట్లం ఏసుదాసుకు చెందిన పొలాలను బుధవారం ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ బ్రహ్మయ్యతో కలిసి సందర్శించారు. గొర్రెలు పొలంలోకి రావటం ద్వారా ఎంతమేర పంటనష్టం జరిగిందో పరిశీలించారు. సంబంధిత అధికారుల ద్వారా అంచనా వేశారు. తదుపరి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

రోడ్లు, కాలువల పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

అవీఇవీ


కలెక్టర్ రాజాబాబును సత్కరిస్తున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో రోడ్లు, కాలువలు ధ్వంసమయ్యాయని, వాటిని పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం గొట్టిపాటి లక్ష్మీతో పాటు టీడీపీ యువనాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్‌లు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ను శాలువతో సత్కరించి మొక్కను అందజేశారు. ఆమె నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తుఫాన్ బీభత్సంతో నియోజకవర్గంలో జరిగిన ఆస్తి, పంట నష్టాలపై కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎస్ఎస్‌పీ, ఆర్‌డబ్ల్యూఎస్ మరమ్మతులకు నిధులు మంజూరుచేయాలని కోరారు. గ్రామాల వారీగా దెబ్బతిన్న రోడ్లు, కాలువలతో కూడిన అంచనాలతో నివేదికను అందజేశారు. మిర్చి, పొగాకు, పండ్లతోటలు దెబ్బతిన్నాయని వివరించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఆయా అంశాలను ప్రభుత్వానికి నివేదించడంతో పాటు తక్షణ అవసరాలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ న్యాయవాది

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ పి.రాజాబాబును ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జెస్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన జి.శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబును కలిసి బొకే అందజేశారు. శ్రీకాంత్ మూడేళ్లు లేదా సర్వీసు నుంచి ప్రభుత్వం తొలగించే వరకు ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగనున్నారు.

ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులను వినియోగించాలి


ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రతిఇంటిలో స్వదేశీ వస్తువులను వినియోగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారుబాబు అన్నారు. మండలంలోని మణికేశ్వరం లో బుధవారం ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ కార్య క్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఇంటింటికి తిరిగి స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు ఈదా చిన్న శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సు బ్రహ్మణ్యం, అద్దంకి నియోజకవర్గ ఇంచార్జి జాగర్లమూడి యలమందరావు, గోపిరెడ్డి, సాయిబాబు, మస్తాన్‌వలి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి (కొండపి) : ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులు వాడాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మాకినేని నరిసింహం పిలుపునిచ్చారు. జరుగుమల్లిలో బుధవారం జరిగిన ప్రతి ఇంటా స్వదేశీ వస్తువుల వినియోగం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి కోమల్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మనిర్భర భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్వదేశీ నినాదంపై అవగాహన కలిగిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కొండపి నియోజకవర్గ కన్వీనర్ మిడసల బాలకోటయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేయాలి

● బాపట్ల జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో విజయలక్ష్మి

పర్చూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూలు నూరు శాతం వసూలు చేసేవిధంగా ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ అధికారులను బాపట్ల జిల్లా డివిజన్ పంచాయతీ అధికారిణి విజయలక్ష్మి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయితీ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఈకేవైసీ, బయోమెట్రిక్, ఏపీ సేవ, పాన్ కార్డు అప్డేషన్, ఎస్‌డబ్ల్యూపీసీ కార్యక్రమాలపై రివ్యూ నిర్వహించి తగు సూచనలు ఇవ్వాలన్నారు. అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేలను అన్నింటినీ సకాలంలో పూర్తిచేయాలన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యతో సతమతం

● వీధిలైట్లు సక్రమంగా వెలగని వైనం

● గ్రామాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

● 50 ఏళ్లనాటి లైన్లు కావడంతో అవస్థలు


ఏడీఏ జె.శ్రీనివాసులకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

చెన్నుంబొట్ల అగ్రహారం (పర్చూరు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మా గ్రామంలో గత 50 ఏళ్ల క్రితం విద్యుత్ లైన్‌లను ఏర్పాటు చేయటంతో స్తంభాలు ఒరిగిపోయి, విద్యుత్ వైర్లు తెగిపోతూ తరచు విద్యుత్ మరమ్మత్తులకు గురికావాల్సి వస్తుందని, దీంతో విద్యుత్ సమ్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారం వాసులు విద్యుత్ శాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. బుధవారం గ్రామ సర్పంచ్ మానం సాంబశివరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయానికి చేరుకొని ఏడీఇ జె.శ్రీనివాసులుకు వినతి ప్రతం అందజేశారు. విద్యుత్ లైన్లు దెబ్బతినటం వల్ల గ్రామ పంచాయితీ వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్న కేబుల్స్ కాలిపోవటం, తరచు మంటలు రావటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి గ్రామం అందకారంలో ఉండాల్సిన దుస్థితి ఉందన్నారు. వీధిలైట్లు ఏర్పాటు నిర్వహణ పంచాయితీకి బారంగా మారిందని, తక్షణమే దెబ్బతిని వరిగిపోయిన స్తంభాలతోపాటు, విద్యుత్ కేబుల్‌ను కూడా మార్చి మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏడీఇని కోరారు.

అవీ..ఇవీ..

తీరంలో కోతకు గురైన ప్రాంతాల పరిశీలన

- కార్తీక స్నానాల్లో భక్తులకు ఇబ్బందులు
- అన్ని చక్కబడ్డాకే అనుమతులు
- టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్



తీరంలో కోతకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న మహేంద్రనాథ్

వాడరేవు(చీరాల), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం స్నానాలకు భక్తులు కొంత ఇబ్బందులు పడ్డారు. అయినా ఎటువంటి ప్రాణనష్టం లేకుండా ఉండేందుకే తీరంలోకి అనుమతులు రద్దు చేసినట్లు టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ పేర్కొన్నారు. బుధవారం మహేంద్రనాథ్ వాడరేవు, రామాపురం తీరంలో కోతకు గురైన ప్రాతాలను పరిశీలించారు. వేటపాలెం, ఈపూరుపాలెం పోలీసులతో మాట్లాడి సమస్య తీవ్రత తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా భారీ కోతలు ఏర్పడినట్లు చెప్పారు. మరి కొద్ది రోజులు అనుమతులు ఉండవని చెప్పారు. పరిస్థితులు చక్కబడ్డాక యధాతథంగా తీరానికి పర్యాటకులకు అవకాశం కల్పిస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీరాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడుతోందని, అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జాండ్రపేట, అక్కయ్యపాలెం రోడ్డు, గుమస్తాల కాలనీ, అయోధ్యనగర్ ప్రాంతాలకు అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రామస్తంభం వీధి, పోలేరమ్మ గుడి, పాపరాజుతోట ప్రాంతాల్లో సేవలకు అంతరాయం ఉంటుందన్నారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి : అద్దంకిలో విద్యుత్ టవర్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని శ్రీనగర్, అన్నాక్యాంటిన్, ఎస్ఎస్‌పీ కార్యాలయం, మార్కెట్‌యార్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామేపల్లి కల్యాణ మండపం వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు మండలంలోని వెంకటాపురానికి చెందిన కిరణ్ బుధవారం సాయంత్రం అద్దంకి నుండి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా మోటార్‌సైకిల్ అదుపు తప్పి పడి గాయలాయ్యాయి. క్షతగాత్రుడు కిరణ్‌ను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

చినగంజాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామానికి చెందిన గడ్డం కోటేశ్వరమ్మకు అదేగ్రామానికి చెందిన మద్దిన మణికంఠ శ్రీనివాస్ అలియాస్ మణికంఠ, మద్దిన సోమయ్య, మద్దిన సుజాతలకు మధ్య గతంలో మనస్పర్ధలున్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 29న ఆమెతో ఘర్షణ పడ్డారును కోటేశ్వరమ్మను మణికంఠ పక్కనే ఉన్న కర్రనుదాడి చేశాడు. సోమయ్య సుజాతలు అయనకు సహకరించారు. దాడిలో గాయపడిన కోటేశ్వరమ్మ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.పేరిలింగేశ్వరరావు కేసు నమోదు చేశారు. నిందితుడుని పోలీసులు అరెస్టు చేయగా, ఈ 19 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం



అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడవీధిపాలెం గ్రామంలో వడ్లమూడి వెంకట్రావుకు చెందిన రేకుల ఇంటిలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహంలోని వస్తువులు దగ్ధమయ్యాయి. దీంతో బాధిత కుటుంబానికి పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి అందజేసిన రూ20 వేల నగదును బుధవారం మండల టీడీపీ నాయకులు వడ్లమూడి వెంకటరావుకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్‌కలాంఅజాద్, కొండ్రగుంట శ్రీహరిబాబు, నక్కల వీర రాఘవులు, వడ్లమూడి సత్యనారాయణ, పీతా రాంబాబు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు సాయం



నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ప్రశాంతి

మార్టూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా మండలంలోని కోనంకి గ్రామంలోని వరదబాధిత కుటుంబాలకు బుధవారం అధికారులు తక్షణ సాయాన్ని అందజేశారు. గ్రామ టీడీపీ నాయకులు కోటపాటి సురేష్ ఆధ్వర్యంలో సమతానగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాదిత కుటుంబాలకు నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె, బంగాళాదుంపలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 174 కుటుంబాలకు నిత్యావసరాలను అందజేస్తా మన్నారు. అంతేగాకుండా బాదిత కుటుంబాలకు నగదును కూడా పంపిణీ చేశామని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వో సుబ్రహ్మణ్యం, మాజీ మండల ఉపాధ్యక్షురాలు కోటపాటి కోమలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందజేయాలి

- రైతుసంఘం మహాసభలో రాష్ట్రకమిటీ సభ్యులు జయంతిబాబు

ఇంకొల్లు, నవంబరు 5,(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దెబ్బతిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కలిపించాలని రైతుసంఘం రాష్ట్రకమిటీ సభ్యులు జయంతిబాబు డిమాండ్ చేశారు. ఇంకొల్లులో రైతుసంఘం 3వ మహాసభలు బుధవారం బాచిన కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతిబాబు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి తలపనేని రామారావు,జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు,ఎర్రం గోవిందరెడ్డి,పేర్ని నాగేశ్వరరావు,సిఐటియు నాయుకులు నాగండ్ల వెంట్రావు, తన్నీరు గోవిందురాజులు, అన్నెం ఆదెయ్య, మాదాల అంజియ్య, మక్కెన హరిబాబు, ఆదినారాయణ, చిలుకూరి శ్రీనివాసరావు, కొల్లూరి హనుమంతరావు, వలేటి అంజియ్య తదితరులు పాల్గొన్నారు.





అద్దంకిలోని వేయిస్తంభాల గుడిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు, మణికేశ్వరంలో బారులుతీరిన భక్తులు, కొణిదెనలో బ్రహ్మకుండంలో భక్తుల స్నానాలు

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- శివాలయాల్లో దీపాలు వెలిగించిన మహిళలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- తీరవెంట భక్తులకు అనుమతి నిరాకరణ

అద్దంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా చినకాశీగా పేరుగాంచిన మణికేశ్వరానికి బుధవారం భక్తులు పోటెత్తారు. గతంలో ఎన్నడూరాని విధంగా భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు కార్తీకదీపాలు వెలిగించుకొని మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో మధ్యాహ్నం వరకు భక్తులు బారులుతీరి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం దేవాలయంలో దీపోత్సవము వైభవంగా నిర్వహించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు నిండుగా ఉండడం, ఇటీవల వరదల నేపథ్యంలో భద్రతా చర్యలలో భాగంగా దేవాలయం పక్కనే ఉన్న గుండ్లకమ్మ నదిలోని స్నానాలఘాట్‌లను మూసి వేశారు. కొద్దిమంది మహిళలు మాత్రం సమీపంలో గుండ్లకమ్మ నదిలో కార్తీక దీపాలను వదిలారు. దేవస్థానం ఈవో గుంటుపల్లి వాసుబాబు, సీఐ సుబ్బరాజుల ఆధ్వర్యంలో దేవాలయం వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. అద్దంకి పట్టణంలోని పాత శివాలయం, వేయిస్తంభాలగుడి, కమలేశ్వరాలయంలలో భక్తులు పెద్దసంఖ్యలో పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బల్లికురవ : మండలంలోని కొణిదెన గ్రామంలో ఉన్న ప్రసిద్ధ బ్రహ్మకుండం కొలనులో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు కార్తీక స్నానాలు చేశారు. సామాన్యశకం 11 వ శతాబ్ధపు నాటి కాలం నుంచి ఉన్న బ్రహ్మకుండంలో స్నానాలు చేస్తే పాపాలు హరించుకుపోతాయని ప్రజలకు అపార నమ్మకం ఉంది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి భక్తులు వాహనాలను ఏర్పాటు చేసుకుని బుధవారం తెల్లవారు జాము నుండే బ్రహ్మకుండం వద్దకు చేరుకొని స్నానాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల మంది భక్తులు స్నానాలనకు రావడంతో బ్రహ్మకుండం పోటేత్తింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా గ్రామస్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు కొలనులో స్నానాలు చేయగానే పక్కనే కుళాయిల ద్వారా కూడా నీటిని అందుబాటులో ఉంచారు. అలానే గ్రామంలో ఉన్న భవాని శంకర స్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వల్లాపల్లి గ్రామం వద్ద ఉన్న అడవి పేరంటలమ్మ దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బల్లికురవ గ్రామానికి చెందిన చిన్నారులు కోలాట ప్రదర్శన ప్రజలను ఆకట్టుకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు శ్రీశైలం, కొటప్పకొండలకు బారీగా తరలి వెళ్లారు.

సంతమాగులూరు : కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం కొప్పరం గ్రామంలో వేంచేసిన శ్రీ బాల త్రిపురసుందరి త్రిపురాంతకేశ్వర స్వామి వారికి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు స్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి: శింగరకొండలో పౌర్ణమి సందర్భంగా బుధవారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు, పూజారులు లక్ష తమలపాకులతో విశేషంగా అలంకరించారు. ఉభయదాతలుగా కొల్లూరుకు చెందిన సమ్మెట వెంకటసాయి శ్రీహర్ష, విమలాదేవి దంపతులు వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పర్చూరు/ కారంచేడు : కార్తీక పౌర్ణమి వేడుకలను పర్చూరు, కారంచేడు మండలాల్లోని ఆయా గ్రామాల్లో భక్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుండే ఆయా శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివార్ల భక్తిని చాటుకున్నారు. పర్చూరులోని భీమేశ్వరస్వామి, ఉప్పుటూరులోని అమరేశ్వరస్వామి, నూతలపాడులోని శివాలయం, నాగులపాలెంలోని నాగేశ్వరస్వామి ఆలయంతోపాటు, చెరుకూరు గ్రామంలోని అగస్తేశ్వర స్వామివార్ల ఆలయంలో కార్తీకపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా దేవాదాయశాఖ అధికారి దామా నాగేశ్వరరావు సారధ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా పర్చూరులోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన దీపోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం పెద్దఎత్తున ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో ఘనంగా అలంకరించారు. అదేవిధంగా మండలంలోని అడుసుమల్లి గ్రామంలోని గౌరీ శంకర ఆలయంలో కోటి దీపోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.

మార్టూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి మార్టూరు సమీపంలోని అమరావతి నూలు మిల్లు ఎదురుగా ఉన్న నాగార్పమ్మ దేవాలయంలో 50 కిలోలు కర్పూరంతో అఖండ కర్పూరపు జ్యోతిని వెలిగించారు. భక్తులు జ్యోతిని దర్శించుకొని పులకించారు. మార్టూరు గ్రామానికి చెందిన వసంతరావు ఆర్థిక సహకారం అందించగా కర్పూరపుజ్యోతిని అర్చకులు వెలిగించారు. మార్టూరు, జొన్నతాళి, ఇసుకదర్శి గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకొని కర్పూరపు జ్యోతిని తిలకించారు. అనంతరం భక్తులకు కమిటి సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇంకొల్లు : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో భక్తులు బారులుతీరారు. బ్రహ్మముహూర్తంలో వేకుమజామున పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆయా ఆలయాల్లో అనంతరం కార్తీక దీపాలు వెలిగించారు. శివుడికి అహిషేకాలు చేయించారు. ఇంకొల్లు శివాలయం మహిళలతో కిక్కిరిసింది. పూజారి సదాశివశాస్త్రి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అరుణాచల శివ అర్థఏకాహం కార్యక్రమాన్ని సంకీర్తానాచార్యులు మద్దినేని ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మిండాల నాగేశ్వరి, ఘంటా సుకన్య, నాదెండ్ల పార్ధసారధి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి

చినగంజాం : అత్యంత ప్రవితమైన కార్తీక మాసంలో వచ్చే కార్తీక పౌర్ణమిని మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. శైవక్షేత్రాలు ఓంకారనాథంతో మారుమోగాయి. కార్తీక దీపాలు వెలిగించి ముక్కంటి సేవలో తరించారు. మండల పరిధిలోని శివాలయాలలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శైవక్షేత్రాల వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. మొంథా తుఫాన్ కారణంగా సముద్రంలో గుంతలు ఏర్పడి ప్రమాదకర పరిస్థితులు ఉన్నందున మండల పరిధిలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం సముద్రతీర ప్రాంతాలను మూసివేశారు. తీరప్రాంతాల్లోని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఎవరు రాకుండా ఇంకొల్లు సీఐ వై.వీ.రమణయ్య ఆధ్వర్యంలో ఎస్.ఐ. శీలం రమేష్ పటిష్ట బందోబస్తు నిర్వహించారు.






సంతమాగులూరులోని త్రిపురాంతకేశ్వరస్వామి, ఆకుపూజలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, నాగార్పమ్మ ఆలయంలో అఖండ కర్పూరజ్యోతి, ఇంకొల్లులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

పలువురు సభ్యుల గైర్హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షతన మొక్కుబడిగా సాగింది. మండలంలో మొత్తం 14 మంది ఎంపీటీసీలు ఉండగా ఎంపీపీ మినహా చినకొత్తపల్లి, శంఖవరప్పాడు, మోదేపల్లి, కలవకూరు, తిమ్మాయపాలెం ఎంపీటీసీలు రాగా తిమ్మాయపాలెం ఎంపీటీసీ సభ్యుడు అడుసుమల్లి బాలమురళీకృష్ణ తమ గ్రామ సమస్యను ఎంపీడీవో వరూధినిని ఛాంబర్‌లో కలిసి సమావేశానికి రాకుండానే వెళ్లిపోయారు. టీడీపీ ఎంపీటీసీలతో పాటు పలువురు వైసీపీ ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. హాజరైన ఎంపీటీసీలతో పాటు ఎంపీపీ సహా ఏ ఒక్కరు కనీసం నోరు విప్పి ఏ సమస్యను ప్రస్తావించలేదు. పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కాగా, మరికొన్ని శాఖల నుంచి మాత్రం మొక్కుబడిగా తమ సిబ్బందిని పంపించి సరిపెట్టారు. మూడు నెలల కొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి వచ్చి సమస్యలపై చర్చించే తీరికి ఎంపీటీసీలకు, అధికారులకు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. సమావేశంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంతో రైతులకు రూ.1.20 కోట్లతో నష్టం వాటిల్లినట్లు అంచనాలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఎంఈవో కేవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 7 పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరినందున వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని 36 గ్రామాలలో ఇంటింటికి కుళాయి ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. ఎంపీడీవో వరూధిని, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గంగాధరరావు, విద్యుత్ ఏఈ శివప్రసాద్, ఇరిగేషన్ ఏఈ నారాయణస్వామి, హార్టికల్చర్ అధికారి దీప్తి పలు శాఖల అధికారులు హాజరయ్యారు.

రహదారి మరమ్మతు పనుల ప్రారంభం

అద్దంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కోతకు గురైన రోడ్డు, వంతెనలపై రాకపోకల పునరద్ధరణకు మరమ్మతు పనులు ప్రారంభించారు. అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం నుంచి చీమకుర్తి మండలం ఇలపావులూరు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డులో మోదేపల్లి వద్ద చిలకూరు ఉధృతికి రోడ్డు పూర్తిగా కోసుకు పోయింది. దోర్నపువాగు ఉధృతికి పేరాయపాలెం వద్ద వంతెన, రోడ్డు కోసుకు పోయింది. ఈ నేపథ్యంలో శనివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మర్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మంగళవారం మరమ్మతు పనులు ప్రారంభిం చారు. మోదేపల్లి వద్ద రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసి బుధవారానికి రాకపోకలు పునరుద్ధరించారు. పేరాయ పాలెం వద్ద ఎక్కువభాగం కోతకు గురికావడంతో తాత్కాలిక మరమ్మతులు ఇంకా కొనసాగు తున్నాయి. ఎట్టకేలకు రాకపోకలు తాత్కాలి కంగా పునురుద్ధరించారు.



మోదేపల్లి వద్ద కొట్టుకుపోయిన రహదారి, వంతెన (ఫైల్)




మోదేపల్లి వద్ద, దోర్నపువాగు వద్ద తాత్కాలికంగా చేసిన మరమ్మతులు

టీడీపీ పట్టణ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం





అరిగల నాగరాజు, దొప్పలపూడి ప్రసాద్, యనిగండ్ల శ్రీనివాసరావు

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణ టీడీపీ నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక పోతురాజుగండిలోని పార్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరిగల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా దొప్పల పూడి ప్రసాద్, ప్రధానకార్యదర్శి గా యనగండ్ల శ్రీనివాసరావు, కోశాధి కారిగా మామిడి రాంబాబు, కార్య నిర్వహక కార్యదర్శులు గా ఇక్కుర్తి శ్రీనివాసరావు, షేక్ మహబూబ్, అద్దంకి ఏడుకొండలు, కార్యదర్శులుగా కన్నెబోయిన మణికంఠ, పప్పుల శ్రీనివాసరావు, బండారు వెంకటరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ కి ఎంపికైన నేతలు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయటం తో పాటు ప్రభుత్వ కార్య క్రమాలను ప్రజలకు వివరించండం జరుగుతుందన్నారు. తమ నియామకానికి సహకరించిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పట్టణ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సేంద్రియ సాగుతో భూసారం పెంపు

పంగులూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంటసాగులో సేంద్రియ పద్ధతులు అవలంభించడం ద్వారా భూమి సారవంతం అవుతుందని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని బైటమంజులూరు, ముప్పవరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో అధునాతన పద్దతులు ఉపయోగించి తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలన్నారు. అనంతరం వరిపొలాలను పరిశీలించారు.

సెయింట్ ఆన్స్‌లో ఓరియెంటేషన్ కార్యక్రమం



ఓరియెంటేషన్ నిర్వహిస్తున్న ప్రతినిధులు

చీరాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యావకాశాలు సకాలంలో అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అందుకోవాలని సెయింట్‌ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో బీ.ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ నిర్వహించారు. హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో ఔషధాలు, డ్రగ్ ప్రిస్క్రిప్షన్‌కు సంబంధించి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. వీవీ.నాగేశ్వరరావు, డైరక్టర్ డా.సుబ్బారావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.జగదీష్ డా.శామ్సన్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచితంగా పశువుల దాణా పంపిణీ



పశుపోషకులకు దాణా అందజేస్తున్న అధికారులు

చినగంజాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం పశుసంరక్షణలో భాగంగా ప్రతి గ్రామంలో పశువులు ఉన్న ప్రతి రైతుకు ఉచితంగా పశు ఆహారదాణా బస్తాలను ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశించినట్లు చినగంజాం పశువైద్యాధికారి బత్తుల కృష్ణ తెలిపారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు మండలంలోని కొత్తపాలెం రైతుసేవా కేంద్రంలో బుధవారం పశు ఆహారా దాణా బస్తాలను పశుపోషకలకు ఉచితంగా పంపిణి చేశారు. మండల పరిధిలోని కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, చినగంజాం, సోపిరాల, పూలవారిపాలెం తదితర గ్రామాలకు చెందిన 70 మంది పశుపోషకులకు దాణా బస్తాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు. గురువారం కూడా పంపణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెదగంజాం జూనియర్ వెటన్నరీ అధికారి కిషోర్, వెటన్నరీ అసిస్టెంట్ మెబీనా, పశు సహాయకులు కుమార్, టీడీపీ నాయకులు రేవు నాంచార్లు, రాజు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, పత్తిపాటి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించాలి

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ను నివారించాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని కలవకూరు, శింగరకొండపాలెంలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చింతా వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది ప్రత్యూష, శేషారావు పాల్గొన్నారు.


నేడు విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ పర్యటన

బల్లికురవ, నవంబరు5(ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలంలోని కొత్తూరు, కొప్పెరపాడు గ్రామాలలో నేడు గురువారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు కొప్పెరపాడు, జమ్మలమడక రోడ్డుకు భూమి పూజ కార్యక్రమం చేపట్టనున్నారు. 10 గంటలకు కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 6 నవంబరు 2025







స్వర్ణాల చెరువుకు గంగా హారతులు ఇస్తున్న వేద పండితులు

దీపం జ్యోతి పరం బ్రహ్మ
దీపం జ్యోతి పరాయణ
దీపేషు సాధ్యతే సర్వం
దీప దేవ్యై నమో నమః

'ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ శంభోశంకర... శంభో శివశంభో...' అంటూ భక్తుల నామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమోగిపోయాయి. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శివ, కేశవుల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా దివ్యక్షేత్రాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కార్తీక దీపారాధనలు, కృతికా దీపం దర్శనం, ప్రాకారోత్సవాలు జరిగాయి. శివాలయాల్లో రాత్రి జ్వాలాతోరణం, లంకా దహన కార్యక్రమాలు నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో తిరుమంజన సేవలు, తులసీదళ అర్చనలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కార్తీక దీపోత్సవాలు నిర్వహించారు. కోనలు, కడలి తీరంలో భక్తులు తరలివచ్చి సముద్ర స్నానాలు ఆచరించి, సైకత శిల్పాలకు పూజలు చేశారు.



హరహర మహాదేవ!

- వైభవోపేతంగా కార్తీక పౌర్ణమి
- శివ, కేశవ ఆలయాల్లో విశేష పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం









కడలితీరానికి పోటెత్తిన భక్తులు

కావలి, (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా సముద్ర తీరానికి భక్తులు పోటెత్తారు. కావలి మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం తీర ప్రాంతాలలోని తీరానికి తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. సముద్రంలో స్నానాలు చేసి, సైకత శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఐదుగురు గజ ఈతగాళ్లను, పడవలను పోలీసులు అధికారులు ఏర్పాటు చేశారు. కావలి డీఎస్పీ పీ.శ్రీధర్, రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐ తిరుమలరెడ్డి, మెరైన్ ఎస్ఐ జానకిరామిరెడ్డిలు తమ సిబ్బందితో తీరంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. విడవలూరు, ఇందుకూరుపేట, ఉలవపాడు, ముత్తుకూరు తీరప్రాంతాలకూ భక్తులు తరలివచ్చారు.

పెంచలకోనలో..

రాపూరు : పెంచలకోన క్షేత్రంలో శ్రీవార్లకు ఏకోత్తర సహస్ర కలశాభిషేకం, విశేష హోమాలు, పూజలు, స్నపన తిరుమంజనం తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. 1001 కలశాలు ఏర్పాటు చేసి శ్రీవార్ల సుదర్శన ఆళ్వార్, సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు చేశారు. నందనవనంలో ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. తనకు ఇష్ట వాహనమైన స్వర్ణ గరుడుడిపై పెంచలస్వామి కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.



కోనలో ఏకోత్తర సహస్ర కలశాభిషేకంలో అర్చకులు

నాడు అధికార బలంతో ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు వేసిన స్కెచ్ బట్టబయలైంది. ఇరిగేషన్ అధికారుల సహకారంతో వేసిన ప్లాన్ వికటించింది. ప్రభుత్వం మారడంతో పెన్నా డెల్టా ఆధునికీకరణ పనుల బిల్లుల్లో జరిగిన మతలబు వెలుగులోకి వచ్చింది. సుమారు ఐదు నెలలపాటు సాగిన విజిలెన్స్ విచారణ పూర్తవగా, పెన్నా ప్యాకేజీ-1 పనుల్లో అక్రమాలు నిజమేనని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. సుమారు రూ.3.50 కోట్లు ప్రజాధనాన్ని ట్యాంపరింగ్ సర్టిఫికెట్లతో కొట్టేదామనుకున్నారని ఆ విచారణలో తేటతెల్లమైంది. ఈ విచారణ నివేదికను తాజాగా ప్రభుత్వానికి పంపారు. ఈ నివేదిక ఇప్పుడు ఓ వైసీపీ ముఖ్య నేత మెడకు ఉచ్చు బిగుస్తోందని తెలుస్తోంది. ఈ ముఖ్యనేతే ప్యాకేజీ-1 పనుల కాంట్రాక్టర్ కావడం గమనార్హం. సదరు నేతతోపాటు ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకు సహకరించిన ఇరిగేషన్ అధికారులపైనా క్రిమినల్ కేసుల నమోదుకు విజిలెన్స్ సిఫార్సు చేసినట్లు సమాచారం.

అక్రమాలు నిజమే!

- విజిలెన్స్ విచారణలో 'ప్యాకేజీ-1'లో బయటపడ్డ స్కాం
- ప్రభుత్వానికి నివేదిక అందజేత
- సుమారు రూ.3.50 కోట్లు కొట్టేసేందుకు ప్లాన్
- సహకరించిన ఇరిగేషన్ అధికారులు
- బాధ్యులపై క్రిమినల్ చర్యలకు సిఫారసు
- వైసీపీ ముఖ్యనేత మెడకు ఉచ్చు

నెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెన్నా డెల్టా సిస్టమ్‌ను ఆధునికీకరించేందుకు 2008-09 సంవత్సరంలో రూ.308 కోట్ల అంచనాలతో ప్యాకేజీ-1 పేరుతో టెండర్లు పిలిచారు. మోడరనైజేషన్ చేయడమే కాకుండా 124 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలన్నది ఉద్దేశం. ఈ వర్కును అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత వైసీపీ కీలక నేత 4.95 శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అయితే ఈ వర్కు అనుకున్న విధంగా పూర్తి కాలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ వెంటనే ప్రీక్లోజ్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లులను గతేడాది ఎన్నికల కోడ్‌కు ముందు హడావిడిగా సీఎఫ్ఎంఎస్‌లోకి ఎక్కించారు. సాధారణంగా పే అండ్ అకౌంట్స్ అధికారుల లాగిన్లలో అంత సామాన్యంగా బిల్లులు ముందుకు కదలవు. కానీ ఈ బిల్లు మాత్రం గంటల వ్యవధిలో పరుగులు పెట్టడం గమనార్హం. అయితే ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఫైనల్ బిల్లు మంజూరు కాలేదు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో అసలు కథ బయటకొచ్చింది. ముందు తప్పులు చేసేసిన అధికారులు.. ప్రభుత్వం మారిన వెంటనే సీఎఫ్ఎంఎస్ నుంచి సాంకేతిక కారణాల పేరుతో బిల్లును వెనక్కు తీసుకున్నారు. ఇలా ఎందుకు చేశారా..? అని ఆరా తీసిన 'ఆంధ్రజ్యోతి'.. అసలు విషయాన్ని వెలుగులోకి తెచ్చింది.



● క్రిమినల్ చర్యలకు సిఫార్సు?

ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ ఫైనల్ బిల్లుకు సంబంధించిన క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌లో కొట్టివేతలు ఉన్నాయి. తొలుత రూ.14.67 కోట్లకు క్యూసీ సర్టిఫికెట్ ఇష్యూ చేశారు. దానిని కొట్టివేసి ఆ స్థానంలో రూ.18.79 కోట్లు రాశారు. అంటే రూ.4.12 కోట్లు పెంచారన్నమాట. నిబంధనల ప్రకారం క్యూసీ సర్టిఫికెట్‌పై ఎటువంటి కొట్టివేతలు ఉండకూడదు. అందులోనూ ఈ కొట్టి వేత కూడా 13 నెలల తర్వాత జరగడం ఆ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది. ఇక ప్రీక్లోజ్ చేశాక వర్కు అంచనాలు రివైజ్ చేయడం కూడా వివాదాస్పదంగా మారింది. వీటన్నింటినీ 'ఆంధ్రజ్యోతి' కథనాల రూపంలో వెలుగులోకి తీసుకురావడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అదే సమయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా ప్యాకేజీ-1పై విచారణ జరపాలని ప్రభుత్వానికి లేఖ రాయడంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ విచారణ ఇటీవల పూర్తయింది. నాటి రికార్డులన్నింటినీ పరిశీలించి, అప్పటి అధికారులు, ఉద్యోగులను విచారించారు. ఈ క్రమంలో చేసిన పనులకు మించి బిల్లులు తీసుకునేందుకు కుట్రలు జరిగాయని నిర్ధారించారు. ఇందుకు బాధ్యులుగా ఐదుగురు అధికారులపై అభియోగాలు నమోదు చేశారు. ఇందుకు బాధ్యులైన వారందరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతోపాటు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని విజిలెన్స్ అధికారులు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

లేదంటే నిబంధనల సాకుతో పెండింగ్
రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పెచ్చుమీరిన అవినీతి
సాంకేతికను తీసుకొచ్చినా.. ఆగని అక్రమాలు
ఏసీబీ దాడులు చేస్తున్న బేఖాతర్!

'అడిగినంత ఇస్తే ఓకే.. లేదా ఆ ఫైల్ కదలదు. లేనిపోని క్వొరీలు వేసి పెండింగ్ పెట్టేస్తారు. మరీ ఎక్కువైతే.. నిబంధనలు సాకు చూపి ఫైల్‌ను వెనక్కి ఇచ్చేస్తారు.' జిల్లావ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న తీరిది. సదరు కార్యాలయాల్లో అవినీతిని అంతమొందించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చినా ఫైళ్ల కింద నోట్లు మాత్రం ఉండాల్సిందే. సొంతంగా దస్తావేజులు రాసుకొని రిజిస్ట్రేషన్ చేసుకొనే వెసులుబాటు ఉన్నా, దస్తావేజులను ఏమాత్రం కష్టపడకుండా పూరించేలా, నమూనా దస్తావేజును ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చినా అక్రమాలకు మాత్రం తెరపడలేదు. అవినీతి అంతమొందిచేందుకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు చేస్తున్నా మేమింతే.. మారమంతే అన్నట్టుగా కొంతమంది సబ్ రిజిస్ట్రార్లు వ్యవహరిస్తున్నారు.

పైసలిస్తేనే
ఫైలు కదిలేది!

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు ఎక్కువ జరుగుతుంటాయి. తనఖా రిజిస్ట్రేషన్లు కూడా నిర్వహిస్తుంటారు. వీటితోపాటు మార్కెట్ విలువల సర్టిఫికెట్లు, ఈసీలు ఇస్తుంటారు. వీటిలో ఒక్కొక్క పనికీ ఒక్కోరేటును నిర్ణయించి, లంచాలు వసూలు చేస్తున్నారని సమాచారం. మొత్తం రిజిస్ట్రేషన్ ఫీజు విలువలో ఒక శాతం నుంచి 2 శాతం లంచాలుగా అధికారులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ఆస్తికి వివరాలు తెలుసుకునే ఈసీలకు సైతం డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈసీకి రూ.300లకుగాను రూ.500 వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

● అధికారిణుల తీరుపై విమర్శలు

జిల్లాలోని మహిళా సబ్‌రిజిస్ట్రార్లలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ప్రజలు ఏకంగా రూరల్ ఎమ్మెల్యేకి, రూరల్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులకు పిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు, నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, ముత్తుకూరు, ఇందుకూరుపేట కార్యాలయాల్లో పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లను తన కార్యాలయానికి పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. అవినీతికి తావులేకుండా పేదలకు సేవలందించాలని వారిని ఆదేశించారు.

● దళారుల రాజ్యం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు దళారులు రాజ్యమేలుతున్నారు. డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థ లేకపోయినా, చాలామంది డాక్యుమెంట్ రైటర్లమని చెప్పుకొంటూ కార్యాలయాల్లోనే తిష్ఠ వేస్తున్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఇటీవల ఒక ప్రకటన విడుదల చేస్తూ దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. అయినా వారు తమ దందాను కొనసాగిస్తున్నారు.



స్టోన్‌హౌస్‌పేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు చేస్తున్న ఏసీబీ బృందం

● స్టోన్‌హౌస్‌పేట కార్యాలయంపై ఏసీబీ దాడి

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏబీసీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా అధికారుల బృందం సోదాలు నిర్వహించింది. ఏసీబీ అధికారుల రాకతో కార్యాలయంలో ఉన్న దళారులు, సిబ్బంది పరుగులు తీశారు. కార్యాలయంలో పనిచేసే ఓ మహిళా సబ్‌రిజిస్ట్రార్ సెలవులో ఉండటంతో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సబ్‌రిజిస్ట్రార్‌ను, అందుబాటులో ఉన్న సిబ్బందిని ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. దస్త్రాలను పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. కొంత నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా గురువారం కూడా ఈ కార్యాలయంలో సోదాలు జరగనున్నట్లు సమాచారం. ఈ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌ను, సిబ్బందిని ప్రశ్నించిన అధికారులు, వివరాలను వెల్లడించలేదు. ఏసీబీ దాడుల వార్త జిల్లావ్యాప్తంగా తెలిసిపోవటంతో అన్నీ సబ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది అప్రమత్తమయ్యారు. తమ కార్యాలయాల్లో కూడా ఏ క్షణంలోనైనా దాడులు జరుగుతాయని తెలిసి, కొందరు ముందుగానే కార్యాలయాలను వదిలి వెళ్లినట్లు తెలిసింది.

నేడు దగదర్తికి మంత్రులు
నారా లోకేష్, ఫరూక్‌ల రాక

కావలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దివంగత మాలేపాటి సుబ్బానాయుడి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ఉదయం దగదర్తికి రానున్నారు. ఉదయం 6గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి లోకేష్ బయలు దేరి 9.30 గంటలకు దగదర్తికి చేరుకుంటారన్నారు. దివంగత సుబ్బానాయుడు ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పలకరిస్తారు. అనంతరం 11 గంటలకు బయలుదేరి అమరావతిలోని సచివాలయానికి చేరుకుంటారని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం రాత్రి నెల్లూరుకు చేరుకుని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బస చేశారు. గురువారం ఉదయం ఉదయం 8 గంటలకు మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆ తర్వాత ఉదయం 9.30 గంటలకు దగదర్తికి చేరుకుని మంత్రి నారా లోకేష్‌తో కలిసి మాలేపాటి కుటుంబసభ్యులను పరామర్శిస్తారని పేర్కొన్నారు.

'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి పైతట్టు ప్రాంతం నుంచి 16,124 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 70.388 టీఎంసీలు నిల్వ ఉంది.

ఆమె ఎవరు!?

- అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహం
- మృతురాలి పక్కనే వరుడి పెళ్లి టోపి - 6లో..



ఇక విద్యాసంస్థల వాహనాల వంతు

- ఈనెల 10 నుంచి ఆర్టీవో తనిఖీలు

నిబంధనలు అమలు చేయకుంటే కఠిన చర్యలు

- వివరాలు 6లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 575

మార్షల్ ఆర్ట్స్ బాలికలకు అవసరం

బిట్రగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ అవసరం ఎంతైనా ఉందని ఎంఈవో జయమ్మ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు బుధవారం తైక్వాండో శిక్షణ తరగతులను మాస్టర్ ఈ. రవిగన్ ప్రారంభించారు. చిన్నతనం నుంచి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాలికలకు తైక్వాండో శిక్షణ ఇస్తున్న మాస్టర్ రవిగన్

అక్రమ అరెస్టులు సరికాదు : విష్ణు

అల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పూర్వాపరాలు పరిశీలించాక నిజంగానే తప్పు చేసి ఉంటే చర్యలు తీసుకోవాలే తప్ప, అక్రమంగా అరెస్టులు చేయడం భవిష్యత్తుకు ప్రమాదకరమని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. అల్లూరులోని ఆయన నివాసంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నేత జోగి రమేష్ అరెస్టుపై ఆయన స్పందిస్తూ మేధోశక్తి కలిగిన సీఎం చంద్రబాబు తొందరపాటు అరెస్టులు ఎలా చేయిస్తున్నారని ప్రశ్నించారు. జోగి రమేష్‌ను అరెస్టు చేసినంత మాత్రాన నకిలీ మద్యాన్ని నిలువరించగలిగారా? అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ కాకుండా ప్రధానితో మాట్లాడి నిలువరించలేకున్నారని, మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించి వైద్య విద్యను ఖరీదైన వ్యవహారంగా మారుస్తున్నారని విమర్శించారు. అక్రమ అరెస్టులు నేడు అలవాటు చేస్తే, భవిష్యత్తులో వచ్చే నాయకులు కూడా ఇదే పంథాను అనుసరిస్తారనే విషయాన్ని మర్చిపోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, గోసల గోపాల్ రెడ్డి, కోమిట్ల పవన్‌కుమార్‌రెడ్డి, మోమిడి మాధవరావు, కరీముల్లా పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

ఓటు హక్కు ప్రాధాన్యత తెలుసుకోండి

లింగసముద్రం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు పాధాన్యత తెలుసుకోవాలని తహసీల్దార్ కె కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, రాజకీయ నాయకుల భవిష్యత్తును నిర్ణయించేది మీరే అని అన్నారు. ఓటు హక్కుతో ప్రజాస్వామ్యం విలువలు కాపాడాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎంవి శివకుమార్, ఆర్ ఐ ఎం రమణయ్య, హెచ్ఎం యు మాధవరావు, బిఎల్ఓ శ్రీదేవి, కంప్యూటర్ ఆపరేటర్ మదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓటు ప్రాధాన్యతను తెలియజేస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు

విద్యార్థుల భవిత కోసమే కోటి సంతకాలు

కావలి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిత కోసమే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోటి సంతకాల ఉద్యమం చేపట్టారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో బుధవారం కోటి సంతకాల సేకరణ జరిగింది. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెట్పీటీసీ జంపాని రాఘవులు, సర్పంచ్ సురేష్, మాజీ సర్పంచ్ కాకి వెంకయ్య, వైసీపీ నాయకులు సన్నిబోయిన ప్రసాద్, తిరుపతి, కోసూరి శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్

విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

కావలి (టౌన్) నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా డీఆర్ విశ్వోదయలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. బుధవారం జేబీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఎంఎం హాలులో జరిగిన డివిజన్ స్థాయి సాంస్కృతిక పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏక పాత్రాభినయం, వక్తృత్వ, నృత్య పోటీలు, జానపద, పౌరాణిక సాంఘిక విభాగాల బృంద పోటీల్లో చిన్నారులు తమ అభినయంతో అలరించారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, ఆర్ మాల్యాద్రి, ప్రసాద్ రెడ్డి, పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా కృష్ణప్రసాద్, నల్లూరు రామకృష్ణ అభిమన్యు, కొండలరావు వ్యవహరించారు.



సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు

బీజేపీలో ప్రతీ కార్యకర్త ఓ నాయకుడే..!

కావలి (టౌన్) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ ప్రవాస యోజన కార్యక్రమం బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఒకటవ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే బలమని, బీజేపీలో ప్రతీ కార్యకర్త ఓ నాయకుడేనన్నారు. త్వరలో బూలింగ్ బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు, వివిధ మోర్చా కమిటీలు నియమించాలని దిశా నిర్దేశం చేశారు. ప్రధాని మోదీ పిలుపుతో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించేలా ప్రజలను జాగృతపరచాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో నేతలు కె బ్రహ్మానందం, జీఎస్టీ మండలి సభ్యులు అమరా సుబ్బారావు, పరుసు వెంకటేశ్వర్లు, మామిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ఎన్‌సీసీ విద్యార్థుల శ్రమదానం

కలిగిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల వద్ద కలిగిరి-సంగం ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ నేపథ్యంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఏ శ్రీను పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి రోడ్లపై ఏర్పడిన గుంతలను బుధవారం మట్టితో పూడ్చించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేసిన మోడల్‌స్కూల్ విద్యార్థులు, పాఠశాల సిబ్బందిని వాహనచోదకులు, ప్రయాణీకులు అభినందించారు.



శ్రమదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

వర్షపు నీరు పోయే దారేది..!?

వలేటివారిపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త కొండసముద్రం గ్రామంలోని ప్రధాన రహదారిపై మోకాటిలోతు వర్షం నీరు నిలిచిపోయాయి. వర్షం నీరు పోయే దారిలేక ప్రధాన రహదారిపైనే నిలిచిపోయాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, గ్రామస్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపై నిలిచిన మోకాటి లోతు నీళ్లలో ద్విచక్రవాహనదారులు పడి ప్రమాదాలబారిన పడుతున్నారు. ప్రధాన రహదారిపై వర్షంనీరు నిలిచిన ప్రదేశంలో మూడు అడుగులు సిమెంటురోడ్డు ఏర్పాటుచేసి కల్వర్టు నిర్మిస్తే వర్షంనీరు నిల్వలేకుండా పోతాయని గ్రామస్థులు తెలిపారు.



కొత్త కొండసముద్రం గ్రామంలోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

● శివకేశవాలయాలకు పోటెత్తిన భక్తులు ● సముద్రంలో పుణ్యస్నానాలు ● ఆలయాల్లో దీపారాధనలు



లింగసముంద్రం : మొగిలిచెర్ల దత్తాత్రేయస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



వీవీపాలెం : శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఉలవపాడులోని శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కావలి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం కావలి రూరల్ మండలంలోని సముద్రతీరం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం తీరప్రాంతాలలోని సముద్ర తీరానికి తెల్లవారు జామునుంచే భక్తుల రాక ప్రారంభమైంది. సముద్రంలో స్నానాలు చేసి, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు ఐదారువేల మందిదాకా భక్తులు పూజల్లో పాల్గొన్నారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కావలి డీఎస్పీ పీ శ్రీధర్, రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐ తిరుమలరెడ్డి, మెరైన్ ఎస్ఐ జానకిరామిరెడ్డిలు సిబ్బందితో తీర ప్రాంతంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ భక్తులను అప్రమత్తం చేయటమే కాక, గజ ఈతగాళ్లు, బోట్లను కూడా సిద్ధం చేసి ఉంచామన్నారు. పౌర్ణమి సందర్భంగా సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉందని, భక్తులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

కావలి (టౌన్): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం పట్టణంలోని శివాలయాలు, వైష్ణవాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాతూరు, వెంగళరావునగర్, ముసునూరు శివాలయాలు, హనుమత్‌క్షేత్రంలోని ఆలయం, విష్ణు, సత్యనారాయణస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసంలో శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీమ పౌర్ణమి నాడు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కార్తీక దీపారాధనలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయాలన్నీ విద్యుద్దీప కాంతులతో కార్తీక శోభను సంతరించుకున్నాయి.

కందుకూరు : కార్తీక పౌర్ణమిని బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కందుకూరు పట్టణం, పరిసర ప్రాంతాలలోని శైవక్షేత్రాలకు వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. పట్టణంలోని స్కంధ పురి సోమేశ్వరాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు వారికి తీర్థప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందజేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆర్యవైశ్యులు ఏర్పాటుచేసిన ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంకమ్మ ఆలయంలోనూ కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శివలింగానికి అభిషేకం నిర్వహించారు. పట్టణంలోని జనార్ధనస్వామి ఆలయం, మాచవరం, మోపాడు, ఓగూరు, పలుకూరు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక దీపోత్సవం జరిగింది. కాగా, పట్టణంలోని కనిగిరి రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారణ స్వాములకు నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించి అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవాసమితి ప్రతినిధులను అభినందించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కోదండరామాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని వలేటివారిపాలెం, పోకూరు, కళవళ్ల, రోళ్లపాడు, కొండసముద్రం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవతామూర్తులకు అభిషేకాలు, విశేష పూజలు చేశారు. రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములు భారీ అన్నదానం ఏర్పాటుచేశారు.

బిట్రగుంట : బోగోలు మండలంలోని ప లు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులవరంలోని గంగాపార్వతి సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయప్రాంగణంలో దీపపు ప్రమిదలతో రూపొందించిన శివలింగ అలంకారం భక్తులకు కనువిందు చేసింది. త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ అధినేత పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. జక్కేపల్లిగూడూరు పంచాయతీ సోమేశ్వరపురంలోని కామాక్షితాయి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఉలవపాడు : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునే కార్తీక స్నానాలు ఆచరించి మహిళలు దేవాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ముక్కంటికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అలగాయపాలెం, కరేడు, రామాయపట్నం, చాకిచర్లలలో పెద్దఎత్తున భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. ఒడ్డున కార్తీక దీపాలు వెలిగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

లింగసముద్రం : కార్తీకపౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని పలు గ్రామాలలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మొగిలిచెర్లలోని దత్తాత్రేస్వామి ఆలయం వద్ద మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. పలు గ్రామాల నుండి వచ్చిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పరమశివుడిని దర్శించుకొని ప్రత్యే పూజలు చేశారు. అలాగే మండలంలోని అన్ని శివాలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

కొండాపురం : కార్తీక పౌర్ణమిని మండలంలోని పలు గ్రామాలలో భక్తులు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. కార్తీకమాసంలో భక్తులు పవిత్రస్నానాలు చేసి వేకువజాము నుండే శివాలయాలకు వెళ్లి శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రమిదలలో ఆవు నెయ్యితో 365 దీపాలను వెలిగించారు. ఇలా చేస్తే 365 రోజులు పూజలు చేసినట్లేనని భక్తుల నమ్మకం. మండలంలోని గానుగపెంటపంచాయతీ ఆదిమూర్తిపురం, గుడవళ్లూరు, గరిమెనపెంట, కొమ్మి గ్రామాలలోని శివాలయాలలో భక్తులు అధికసంఖ్యలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

అల్లూరు : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని అల్లూరు మండలంలోని అన్ని శైవాలయాల్లో బుధవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని ఇస్కపల్లి శివాలయంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జ్యోతి దంపతులు ఆది దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకాశదీపం, జ్వాలా తోరణం కార్యక్రమాలు ఆధ్యాత్మికతను ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమంలో బీద గిరిధర్, సుజన దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలోభక్తులు ఆలయాలకు చేరుకొని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

కలిగిరి : పట్టణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, సిద్దనకొండూరులోని సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. మహిళలు ఆలయాల ప్రాంగణాల్లో కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



కొండాపురం : పూజలు చేస్తున్న భక్తులు



అల్లూరు : ఇస్కపల్లి శివాలయంలో పూజల్లో పాల్గొన్న బీద రవిచంద్ర, జ్యోతి దంపతులు



కావలిటౌన్ : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వ్యాస రచన పోటీలో నలంద విద్యార్థుల ప్రతిభ

కావలి (టౌన్) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్ నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గొల్లమూడి వీధిలోని నలంద ఒలింపియాడ్ పదవ తరగతి విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. తెలుగు మాధ్యమంలో ఏ సాయిపార్థివ్ పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా బీవీఎస్ మోక్ష ద్వితీయ స్థానం, భార్గవి తృతీయ స్థానాల్లో నిలిచారు. ఆంగ్ల మాధ్యమంలో బీ తేజస్విని పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, వీ శిల్ప, నందిని ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. బుధవారం ఒకటవ పట్టణ సీఐ ఫిరోజ్, నలంద డైరెక్టర్ ఎండీ వశీం, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

నేడు మోచర్ల వద్ద టీడీపీ నేతలతో లోకేష్ భేటీ

కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలోని దగదర్తికి విచ్చేస్తున్న రాష్ట్రమంత్రి, టీడీపీ యువనేత నారా లోకేష్ గురువారం ఉదయం 7 గంటలకు కందుకూరు నియోజకవర్గంలోని మోచర్ల వద్ద ఆగి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడతారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు.

ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

నెల్లూరు(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ రామ్మోహన్‌ను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరి హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీహెచ్‌పీ) నేతలు బుధవారం సన్మానించారు. డాక్టర్ మస్తాన్‌బాషాను జీజీహెచ్‌లో, డాక్టర్ రామ్మోహన్‌ను ఆయన ఆసుపత్రిలో కలిసి ప్రత్యేకంగా శాలువా, పూలమొక్కలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సహకారంతో సిఫార్సు చేసిన రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నేతలు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, రాందాసు, రాఘవయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిక

కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు మురారిశెట్టి శ్రీకాంత్ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం పెద్దబజారులో ఉన్న కోదండరామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, యువకుల సమక్షంలో ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు శ్రీకాంత్‌కు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ శ్రీకాంత్ చేరికతో టీడీపీకి మరింత బలం చేకూరిందని, ఆర్యవైశ్యులు అంతా కలిసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు గుర్రం శింగయ్య, వేముల సుకుమార్, డాక్టరు తన్నీరు మల్లిఖార్జున, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, టీడీపీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నైట్‌సర్వీస్ ప్రారంభం

కందుకూరు - సింగరాయకొండల మధ్య ఆర్టీసీ నైట్ సర్వీస్‌ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైలు ప్రయాణీకుల సౌకర్యార్థం 8 సంవత్సరాల క్రితం వరకు నైట్ సర్వీస్ ఉండేదని, ఆతర్వాత నిలిచిపోయిన సర్వీస్‌ను ప్రస్తుతం పునరుద్ధరించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ఆర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, యూ. శ్రీనివాసరావు,సీహెచ్. కొండయ్య, కూనం నరేంద్ర, షేక్ మున్నా, ఎం.శ్రీనివాసరావు, ఎం. సుధీర్, కొత్తూరి వెంకటసుధాకర్, షేక్ రూబీ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన మురారిశెట్టి శ్రీకాంత్, ఎమ్మెల్యే ఇంటూరిలను సత్కరిస్తున్న ఆర్యవైశ్య యువకులు

ఇన్నోవేషన్ - 2025 పోటీల్లో 'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సాంకేతిక ప్రతిభతో తమ కళాశాల విద్యార్థుల ఆవిష్కరణ పలువురి ప్రశంసలందుకుని బహుమతులు సాధించిందని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్ఈ (ఏఐ) విభాగానికి చెందిన థర్డ్ ఇయర్ విద్యార్థులు పవన్, రాఘవేంద్ర, గణేష్, మణికుమార్‌లు రూపొందించిన మల్టీపర్పస్ బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ కమ్ ఇంటర్ కల్టివేటర్ ప్రాజెక్టును కడపలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ఇన్నోవేషన్ 2025 పోటీలలో ప్రదర్శించగా ప్రశంసలు, బహుమతులు సాధించిందన్నారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన కళాశాల ఆర్‌అండ్‌డీ డీన్ డాక్టరు ముప్పా లక్ష్మణరావును, విద్యార్థులను ఆయన అభినందించారు.

డిసెంబరు 4న ఘంటసాల జయంతి

నెల్లూరు(సాంస్కృతికం),(ఆంధ్రజ్యోతి): ఘంటసాల కళానికేతన్ ఆధ్వర్యంలో డిసెంబరు 4న దర్గామిట్ట శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రం ఆవరణలోని ఘంటసాల విగ్రహం వద్ద ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు జయంతి వేడుకలు జరుగుతాయని కళానికేతన్ అధ్యక్షుడు ఆనందరావు తెలిపారు.

పోర్టు నిర్వాసితుల కాలనీలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

● నీటి ప్రవాహంతో దెబ్బతిన్న సపోటా చెట్లు ● న్యాయం చేయాలని బాధిత రైతు మొర

ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు నిర్మాణంలో భాగంగా ఖాళీ చేసిన గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాక్యేజి కింద కట్టిస్తున్న ఇళ్ల ప్లాటుల్లో వేసిన రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పోర్టు నిర్మాణం కారణంగా ఖాళీచేసిన గ్రామాల్లో ఒకటైన కర్రలపాలెం గ్రామస్థుల కోసం రామాయపట్నం మెయిన్ రోడ్డుకు ఆనుకొని మారిటైం బోర్డు కొనుగోలు చేసిన 43 ఎకరాల్లో 370 ప్లాట్లు వేసి సిమెంట్ రోడ్లు, డ్రైనేజి ముందస్తుగా నిర్మించారు. ఇళ్ల నిర్మాణాలు పోర్టు ఇంజనీరింగ్ అథారిటీ విభాగం పరిధిలోనే జరుగనున్నాయి. అయితే కాలనీలో ఏర్పాటుచేసిన డ్రైన్‌ల ద్వారా మురుగు నీరు వెళ్లే వాటం దక్షిణం నుంచి ఉత్తరం వైపునకు మళ్లించి కాలువలు నిర్మించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద వేసిన లేఅవుట్ చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రహరీకి ఆనుకొని ఉత్తరం వైపున చాగొల్లు గ్రామానికి చెందిన తమ్మినేని నరసింహనాయుడుకు చెందిన 14 ఎకరాల సపోటా తోట ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు పోర్టు నిర్వాసితుల లేఅవుట్‌లోని వర్షపు నీరంతా డ్రైన్‌ల ద్వారా ప్రవహించడంతో సపోటా చెట్లు పొలం వైపున ప్రహరీ గోడ కూలిపోయింది. అంతేగాక లేఅవుట్‌లో వర్షం నీరంతా సపోటా తోటలో ప్రవహించడం తో నష్టం జరిగిందని, పోర్టు ఇంజనీరింగ్ అధికారులకు జరిగిన నష్టాన్ని చూపించినా ని మ్మకు నీరెత్తినట్లు ఉన్నారని బాధిత రైతు ఆరోపిస్తున్నారు. కాలనీ లేఅవుట్ నిర్మాణంలో లోపభూయిష్ట డ్రైనేజి వ్యవస్థ కారణంగా, ఇంజనీరింగ్ అధికారుల అనాలోచిత నిర్మా ణం వలన పట్టా భూమి కోతకు గురై సపోటా చెట్లకు నష్టం జరిగిందన్నారు. వర్షపు నీరు, కాలనీవాసులు వాడిన మురుగు నీరంతా దిగువన ఉన్న సపోటా తోటలోకే చేరుతోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కర్రలపాలెం పోర్టు నిర్వాసితుల లేఅవుట్‌లో నిర్మించిన డ్రైనేజి వ్యవస్థను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.



వర్షపు నీళ్ల తాకిడికి పడిపోయిన ప్రహరీగోడ, కోతకు గురైన సపోటా తోట



ఇందుకూరుపేట : మైపాడు తీరంలో మహా శివలింగానికి పాలభిషేకం



బుచ్చి : జొన్నవాడలో జ్వాలాతోరణం




నెల్లూరులో మీనాక్షి, సుందరేశ్వరస్వామి.. రమాదేవి వీరవెంకట సత్యనారాయణ స్వామిల కల్యాణం



కావలి తీరంలో..

- వైభవోపేతంగా కార్తీక పౌర్ణమి
- శివ, కేశవ ఆలయాల్లో విశేష పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- పటిష్ట భద్రత నడుమ సముద్ర స్నానాలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

శంభో.. శివశంభో!



నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శివ, కేశవుల ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం వేడుకగా జరిగాయి. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల వద్ద బారులుతీరారు. శంభోశంకర, హరహర శంకర నామ స్మరణలతో ఆలయాలు హోరెత్తి పోయాయి. కడలి తీరంలో భద్రతకు నిర్ధేశించి ప్రాంతాల్లో సముద్ర స్నానాలకు భక్తులకు అనుమతి ఇచ్చారు. కోస్టల్ పోలీసుగార్డులు పర్యవేక్షించారు. జిల్లాలోని అన్నీ దివ్యక్షేత్రాలు ఆలయాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపారాధనలు కృతికా దీపం దర్శనం ప్రాకారోత్సవాలు జరిగాయి. శివాలయాల్లో రాత్రి జ్వాలాతోరణం, లంకా దహన కార్యక్రమాలు నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో తిరుమంజనం సేవలు, తులసీదళ అర్చనలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కార్తీక దీపోత్సవాలు నిర్వహించారు. తరలివచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. దేవాలయాల్లో భక్తులకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.



● భక్తజనంతో ఉప్పొంగిన స్వర్ణాలతీరం

నగరంలోని మూలాపేట గణేష్ ఘాట్‌లో స్వర్ణభారత్ ట్రస్ట్, సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ సంయుక్తంగా కార్తీక దీపోత్సవం, స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా ఉదయం గోపూజ, శివుడికి భక్తుల ద్వారా అభిషేకాలు, శ్రీశైలం నుంచి తెచ్చిన రమాదేవి సహిత వీరవెంకటసత్యనారాయణ స్వామి, మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామిలకు అభిషేకాలు జరిగాయి. అనంతరం కల్యాణోత్సవాలను వైభవోపే తంగా నిర్వహించారు. సామూహిక లలితా సహస్ర నామ పారాయణాలు, ఇతర పూజా కార్యక్ర మాలతోపాటు రుద్ర



శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

హోమం, మధ్యాహ్నం అన్నప్రసాదం వితరణలు జరిగాయి. ఉదయం, రాత్రి భక్తుల కు వివిధ ఆలయాల నుంచి ప్రసాదాలు పంపిణీ చేశారు.

● కనులపండువగా శోభాయాత్ర

మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటం, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలతో స్వర్ణలింగేశ్వర ఆలయం నుంచి ఇరుకళల పరమేశ్వరి ఆల యం వరకు శోభాయాత్ర జరిగింది. ఈ శోభా యాత్రను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రె డ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెం కట్, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, కార్తీక దీపోత్సవ కమిటీ, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నాయకులు ప్రారంభించారు.

● గంగా హారతులు

ఇరుకళల పరమేశ్వరి ఘాట్ వద్ద రాత్రి హరిద్వార్ నుంచి విచ్చేసిన వేదపండితులతో



మాట్లాడుతున్న సినీ గేయరచయిత అనంత శ్రీరామ్

స్వర్ణాల చెరువుకు గంగా హారతులు వైభవంగా జరిగాయి. అనంతరం మహిళలు స్వర్ణాల చెరువులోకి కార్తీక దీపాలు వదిలారు. పౌర్ణమి చంద్రుడి కాంతిలో కార్తీక దీపాల వెలుగులు భక్తులకు నేత్రానందం కలిగించాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టు సత్యనారాయణ, శ్రీకంఠం రమణయ్య, కార్తీక దీపోత్సవ కమిటీ అధ్యకురాలు వెన్నెల, సభ్యులు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, జనసేన పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





సీతారామపురం : భైరవకోనలో భక్తుల దీపారాధన



కందుకూరు : సోమేశ్వరాలయంలో..



చిట్రగుంటలో దీపాల ఆకృతి



సంగంలో పుష్పాలతో జ్యోతిర్లింగాకారం



నెల్లూరు : స్వర్ణాల చెరువులో భక్తులు

వేదగిరిపై కార్తీక శోభ




1. వేదగిరిపై కార్తీక దీపం
2. గరుడుడిపై వేదగిరీశుని ఊరేగింపు

నెల్లూరురూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వేదగిరి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి సన్నిధి ఎదురు, ధ్వజస్తంభం వద్ద పవిత్ర కార్తీక దీపాన్ని వెలిగించి పౌర్ణమి ప్రత్యేకతను చాటారు. అనంతరం గరుడ వాహనంపై ఆశీనులైన లక్ష్మీనరసింహుడి ఊరేగిస్తూ ఆలయ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిం చారు. భారీగా తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్ రెడ్డి, ఈవో గోపి, ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, అర్చక బృందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న దాడులు

- జిల్లావ్యాప్తంగా 72 కేసులు... 31 బస్సుల స్వాధీనం
- తుఫాన్ నేపథ్యంలో ఆగిన రవాణా శాఖ తనిఖీలు
- 10 నుంచి స్కూల్ బస్సులపై...

నెల్లూరు(క్రైం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత నెలలో కర్నూలు సమీపంలో జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రవాణాశాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రాష్ట్రంలో వరుస దాడులు చేస్తున్నారు. జిల్లాలో డీటీసీ బీ. చందర్ ఆధ్వర్యంలో దాడులు ముమ్మరం చేశారు. నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రావెల్ బస్సులపై 71 కేసులు నమోదు చేశారు. 31 బస్సులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తుఫాన్ నేపథ్యంలో దాడులు ఆగాయని, అయితే నిరంతరం కొనసాగుతాయని రవాణా అధికారులు తెలిపారు.

● నిబంధనలకు నీళ్లు

రోడ్లపై తిరిగే వాహనాలకు నియమ,నిబంధనలు ఉంటాయి. వీటిని వాహన యజమానులు తప్పనిసరిగా పాటించాలి. అయితే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులు నిబంధనలను తుంగలో తొక్కి ఆదాయమే లక్ష్యంగా వాహనాలను నడుపుతున్నారు. ఇటీవల రవాణా శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు సంబంధించిన ఆర్‌సీలో సీటింగ్ బస్సు అని రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఆ బస్సులనే స్లీపర్ బస్సులుగా నడుపుతున్నారు. 2023 తర్వాత రిజిస్ట్రేషన్ అయిన బస్సులకు తప్పనిసరిగా ఎఫ్‌డీఎస్‌ఎస్ ఉండాలన్న నిబంధన అమలు కావడంలేదు. 2019 నుంచి మార్కెట్‌లోకి వచ్చిన బస్సుల్లో ప్రమాదం జరిగిన సమయంలో అలారం మోగాలన్న నిబంధనలు ఉన్నా పాటించడం లేదు. ఎమర్జెన్సీ డోర్ల వద్ద సీట్లు ఏర్పాటు చేయడం, బస్సు ముందు అద్దాలు పగిలి ఉండటం, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయకపోవడం, డ్రైవరు వెనుక సీటులో మరో డ్రైవర్ కోసం బెర్త్ ఏర్పాటు చేయడం ... తదితర నిబంధనలను యథేచ్ఛగా అతిక్రమిస్తున్నారు. రవాణాశాఖ అధికారాలు జరిపిన వరుస దాడుల్లో ఈ విషయాలను గుర్తించి, 71 కేసులు నమో దు చేశారు. 31 బస్సులను సీజ్ చేశారు. రూ. 10 లక్షలకుపైగా అపరాధ రుసుం విధించారు.

● 10 నుంచి స్కూల్ బస్సులపై...

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 10 నుంచి రవాణాశాఖ అధికారులు విద్యాసంస్థల బస్సులపై దాడులు చేయనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల యజమానులతో డీటీసీ ఈనెల 1న జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులను తరలించే వాహనాలు తీసుకోవాల్సిన నిబంధనలు, ప్రమాదం జరిగిన సమయంలో ఉండాల్సిన ముందస్తు ఏర్పాట్లపై యజమానులకు వివరించారు. నిబంధనల మేరకు వాహనాలు లేకుంటే ఈనెల 10 నుంచి జరిపే తనిఖీల్లో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



విద్యాసంస్థల యజమానులతో మాట్లాడుతున్న డీటీసీ చందర్(ఫైల్)

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహం

- మృతురాలి పక్కనే వరుడి పెళ్లి టోపి
- అత్యాచారం చేసి హత్య చేశారా.. సాధారణ మరణమా?

నెల్లూరు(క్రైం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్న ఓ మహిళ మృతదేహం బుధవారం వెలుగు చూసింది. మృతురాలి పక్కనే వరుడి పెళ్లి టోపీ ఉంది. అయితే ఆ మహిళను అత్యాచారం చేసి హత్య చేశారా.. లేక సాధారణ మరణమా? అని పలువురు అనుమానిస్తున్నారు. వివరాల మేరకు.. నగరంలోని వనంతోపు సెంటర్ సమీపంలో శ్రీచైతన్య పాఠశాలకు వెనుక వైపు ఖాళీ ప్రాంతంలోకి అదే ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ బుధవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లాడు. ఆ ప్రాంతంలో విపరీతమైన దుర్వాసన వస్తుండటంతో కొంచెం ముందుకెళ్లి చూడగా తూములో ఓ మహిళ మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. దీంతో అతను పరుగులు తీస్తూ బయటకు వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలంకు చేరుకున్న పోలీసులు తూములో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో ఆమె మరణించి సుమారు నెల రోజులకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. కాళ్లు, చేతులు, ఆమె ధరించిన చీరను బట్టి ఉన్నత కుటుంబానికి చెందిన మహిళ అయ్యి ఉంటుందని భావిస్తున్నారు. ఆమె మృతదేహం పక్కనే పెళ్లిల్లో వరుడు ధరించే టోపి ఉండటం అనేక అనుమానాలకు తావిస్తుంది. ఈ టోపి మృతదేహం పక్కకు ఎలా వచ్చింది.. కక్షతో ఎవరైనా హత్య చేసి మృతదేహం పక్కనే టోపి ఉంచారా.. లేక ఆమెపై అత్యాచారం చేసి హత్య చేశారా? సాధారణ మరణమా.. ఆత్మహత్య.. ఇలా అనేక అనుమానాలు పోలీసుల్లో వ్యక్తమవుతోన్నాయి. ఈ మేరకు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ కల్యాణరాజు, సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓం నమఃశివాయ..!

మూలాస్థానేశ్వరాయలంలో వైభవంగా కృతికా దీపోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం అన్నీ ఆలయాల్లోనూ వైభవంగా జరిగాయి. మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. శంభో శంకర.. హరహర శంకరా... అంటూ నామస్మరణలు ఆలయంలో మారుమోగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మూలస్థానేశ్వరస్వామి సన్నిధి, సహస్రలింగేశ్వర స్వామి సన్నిధి, వనంలో శివయ్య సన్నిధుల్లో పాలభిషేకాలు నిర్వహించారు. అనంతరం రుద్రహోమం జరిగింది. మూలస్థానేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం కార్తీక దీపాలతో ఆలయం కళకళలాడింది. కృతికాదీపం (నూనెతో చంద్రదర్శనం) కోసం వేలాది మంది బారులు తీరి ద ర్శించుకున్నారు. అనంతరం జ్వాలా తోరణం జరిగింది. ప్రముఖులు పలువురు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు ఈవో అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



మూలాస్థానేశ్వరాలయంలో కృతికా దీపం వెలిగిస్తున్న అధికారులు, ఆలయ ధర్మకర్తలు

చిన్నారుల సంరక్షణ కేంద్రాలను నిబద్ధతలో నిర్వహించాలి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిన్నారుల సంరక్షణ వసతి గృహాలను నిబద్ధతతో నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా నిర్వాహకులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో దత్తత గోడపత్రికను ఆవిష్కరించారు. 30 చైల్డ్ కేర్ హోమ్స్‌కు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందచేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ జువైనైల్ చట్టం 2015 ప్రకారం ప్రతి చైల్డ్‌కేర్ హోమ్‌ను అన్నీ వసతులతో పాటు పిల్లల భద్రత, ఆరోగ్యం తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, జిల్లా ప్రొబేషన్ అధికారి ఫరూక్, బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకుముందు కలెక్టరేట్‌లోని పలు సెక్షన్‌లను కలెక్టర్ హిమాన్షు శుక్లా తనిఖీ చేశారు. కలెక్టరేట్ టెర్రస్‌లో పరిస్థితిని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.



దత్తత గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

భువనేశ్వరమ్మపై ఈర్ష్య ఎందుకు!?

- కాళ్లు పట్టుకునే చరిత్ర నీదైతే.. సేవచేసే గొప్పమనస్సు ఆమెది
- ప్రసన్నకుమార్‌రెడ్డిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆగ్రహం

నెల్లూరు(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత లక్ష్మీపార్వతి అంటే ఆయనకు దైవం... ప్రజా సేవ చేసే గొప్ప మనస్సు ఉన్న నారా భువనేశ్వరమ్మ అంటే ఎందుకంత ఈర్ష్య అని మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. భువనేశ్వరమ్మకు వస్తున్న మంచిపేరు చూసి తట్టుకోలేక అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నారాయణ వైద్య కళాశాలలో అనధికార భాగస్వామి అని ప్రసన్న చేసిన ఆరోపణలో వాస్తవం లేదన్నారు. హెరిటేజ్ సంస్థ చైర్‌పర్సన్‌గా నారా భువనేశ్వరి రానిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో లండన్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ గోల్డెన్ పీకాక్ అవార్డు కూడా అందజేశారన్నారు. దేశంలోనే అత్యుత్తమ డెయిరీగా తీర్చిదిద్దడంతోపాటు కొత్త ఉత్పత్తుల అవిష్కరణలో ఆమెకు ప్రత్యేక గుర్తింపు లభించిందని చెప్పారు. ఎన్టీఆర్ మేనేజింగ్ ట్రస్టీగా విశిష్ట సేవలు అందిస్తున్నారన్నారు. రాజకీయాల్లో కాళ్లు పట్టుకోవటం ప్రసన్నకు వెన్నతో పెట్టిన విద్య అని, గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు కాళ్లు పట్టుకున్నారని, ఆ తర్వాత జగన్‌రెడ్డి కాళ్లు పట్టుకున్నారని ఎద్దేవా చేశారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 50 మంది చనిపోతే జగన్‌రెడ్డి వారిని కనీసం పలకరించిన పాపాన పోలేదన్నారు. అదే భువేశ్వరమ్మ ఒక్కో కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారని వెల్లడించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ2700 కోట్లు బకాయిలు పెట్టిపోతే చంద్రబాబు ప్రభుత్వం వాటిని చెల్లించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఇంకోసారి భువనేశ్వరమ్మ గురించి తప్పుగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరుకి 'మాల్ ఫీజియన్' అందాలు

నెల్లూరు(సిటీ),(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరాన్ని కార్పొరేషన్ అధికారులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. చూపరులను ఆకట్టుకునేలా ప్రధాన రోడ్లు, రహదారుల మధ్య డివైడర్లలో ఆకర్షణీయమైన మొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో గార్డెన్లలో ప్రత్యేకంగా కనపడే 'మాల్‌ఫీజియన్' మొక్కలను వివిధ ఆకృతిల్లో ఏర్పాటు చేస్తున్నారు. బాల్స్‌గానూ, కోనులతో పాటు డివైడర్ విస్తీర్ణాన్ని బట్టి ఆకృతిని డిజైన్ చేస్తున్నట్లు ఎన్‌ఎంసీ ఉద్యాన అధికారి నరసింహరావు తెలిపారు. నగరంలోకి ప్రవేశించే ప్రాంతాలలోని ప్రధాన డివైడర్ల వద్ద తొలత ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

